

తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక
SAPTHAGIRI
SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:57, Issue: 02
July - 2026, Price Rs.20/-
జూలై 2026
వెల రూ. 20/-
పుటలు - 56
శ్రీవారి ఆణివరఆస్థానమహోత్సవం,
తిరుమల
(17-07-2026)


శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి పుష్పయాగమహోత్సవము,
అప్పలాయగుంట
(30-07-2026)



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : యామిమాం పుష్పితాం వాచం ప్రవదన్త్య విపశ్చితః।**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-42వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** యామ్ ఇమాం= ఏ ఈ; పుష్పితామ్= ఫలప్రదముకాని కేవల పుష్పములవలె చూపులు మాత్రము రమ్యమై ఉండునదియు; వాచమ్= వాక్యమును; ప్రవదన్తి= విశేషించి చెప్పుచున్నారో; అవిపశ్చితః= అవివేకులు (తత్త్వము తెలియని అల్పజ్ఞానులు); వేదవాదరతాః= వేదమునందు ఫలమును తెలిపెడి భాగములందు (అర్థవాదములందు) ప్రీతిగలవారును; పార్థ= అర్జునా; నాన్యదస్తీతివాదినః= అందు చెప్పబడిన స్వర్గాదులకంటె అధికమైన ఫలము వేరొకటి లేదని వాదించువారును.

**భావం:** ఓ అర్జునా! అల్పజ్ఞానులు, వివేకం లేనివారు వేదాలలోని కర్మకాండలను మాత్రమే నమ్ముతూ, అలంకారప్రాయమైన, ఆకర్షణీయమైన మాటలను పలుకుతారు. స్వర్గసుఖాలు తప్ప, అత్యున్నతమైన పరమార్థం (ఆత్మజ్ఞానం) ఇక ఏదియూ లేదని వాదిస్తారు.

---

## గురుకృప గలిగిన గుణనిధికి...!

అజ్ఞానుల కివి - యరుహము లింతే
సుజ్ఞానుల కివి - చొర నేలయ్యా!

దైవము నమ్మిన - దాసులకు
కావింపఁగ మరి - కర్మము లేదు,
దావతి జలనిధి - దాఁటిన వారికి
వోవల మరియును - వోడేలయ్య!

గురుకృప గలిగిన - గుణనిధికి
అరయఁ బాపవు - ణ్యము మరి లేదు,
విరసపుఁ జీఁకటి - వెడలిన వారికి
పరగ మరియు దీ - పం బేలయ్య!

జగము లెరుఁగు వై - ష్ణవులకును
తగిలెటి యపరా - ధంబులు లేవు,
అగపడి శ్రీవేంక - టాధిపుఁ గొలిచితే
యెగువ దిగువ మా - కెదురేదయ్య!

ఆధ్యాత్మసంకీర్తన- సంపుటం 04- సంకీర్తన 260



ఈ చెప్పబోవునవి అజ్ఞానులకే తగినవి. ఇంతేకాని సుజ్ఞానులైనవారు ఇందులో ప్రవేశింపవలసిన పని ఏమున్నది?

ప్రపన్నులై భగవంతుని నమ్మిన భాగవతులకు తర్వాత చేయదగిన పని ఏదియు లేదు. ఒడుదొడుకులతో దుస్తరమైన సముద్రము నెట్లో ప్రయాసపడి దాటినవానికి మరల పడవతో పని ఏమున్నది?



గురుని కృపకు పాత్రుడైన గుణవంతునికిక పుణ్యపాపము లనునవి లేవు. చిమ్మచీకటినుండి బయటపడినవానికి మరల దీపమెందుకయ్యా !

జగత్ప్రసిద్ధులైన వైష్ణవశ్రేష్ఠులకు అంటగల అపరాధములు ఏవియు లేవు. శ్రీవేంకటేశ్వరుని సేవించిన మాకు పై లోకములలోగాని, క్రింది లోకములలోగాని ఎదురెక్కడిదయ్యా! అంటూ అన్నమయ్య గురువు గొప్పదనాన్ని పై సంకీర్తనలో వర్ణించాడు. - కీ.శే.సముద్రాల లక్ష్మణయ్య

# తండ్రికే గురుస్వామయ్యాడు!!

- శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర, 63005 46700

సృష్టిలో అంతా చిత్రమే... అటువంటి అరుదైన విషయం కుమారస్వామి తన తండ్రి పరమశివుడికి గురూపదేశం చేసిన అంశం మన అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. సాక్షాత్తు జగమెరిగిన జంగమయ్య కైలాసములో కొలువైనసమయంలో పరమశివుడికి ఈ జ్ఞానబోధను ఆయన కుమారుడు కుమారస్వామి చేయడం విచిత్రమే కదా!




ఉమామహేశ్వరుల పుత్రుడు కుమారస్వామి. శివపార్వతులకు పుట్టిన కార్తికేయుడు దేవతలసైన్యానికి అధిపతి. కార్తికేయునిచేతిలో ఉన్న శక్తి బ్రహ్మవిద్య నుండి పుట్టినశక్తి,

కుమారస్వామికి ఇద్దరు భార్యలు వల్లి, దేవసేన. వీరు ఇరువురు జ్ఞాన శక్తి సంపన్నులు. దేవసేన సత్త్వగుణానికి చిహ్నం కాగా కుండలినీశక్తి నియంత్రణకు గుర్తు వల్లీ అంటారు.

కుమారస్వామివారి వాహనం నెమలి. నాగరికలిపిలో ఉన్న ఓంకారంలా ఉంటుంది. తనను ధ్యానించేవారికి జ్ఞానం కలిగిస్తాడు కుమారస్వామి. నెమలి పురి విప్పునప్పుడు ఓంకారంలా ఉంటుంది. అందుకే ఆయన తన వాహనంగా నెమలిని ఎన్నుకున్నాడు.

ఈ మేరకు ఒక గాథ ఉన్నది. ఒకసారి బ్రహ్మదేవుడు పరమేశ్వరునిదర్శనంకోసం వచ్చాడు. అప్పుడు శివుడు ధ్యానస్థితిలో ఉన్నాడు అక్కడే ఉన్న కుమారస్వామి అతనిని అడ్డుకుని ఎవరు మీరు? ఎందుకు వచ్చారు? అని ప్రశ్నించాడు. అందుకు బ్రహ్మదేవుడు "అహం బ్రహ్మస్మి" అని సమాధానమిచ్చాడు. కుమారస్వామి నవ్వుతూ నువ్వు ఏమి బ్రహ్మ అంటూ నిర్గుణం లేదు.. రూపం లేదు. నీవు రూపంతో ఉన్నావు. బ్రహ్మ అక్షరుడు కానీ నీ రూపం నశిస్తుంది. బ్రహ్మ నిశ్చలం కానీ నీవు చలించుచున్నావు. నీవా శబ్దమునకు తగవని వాదించాడు కుమారస్వామి. ఇక చేసేది లేక బ్రహ్మ శక్తి చాలక మౌనం వహించాడు. ఆ స్థితిలో శంకరుడు సుబ్రహ్మణ్యం అన్నారు.

బ్రహ్మదేవుడు తలలు వాల్చారు. కుమారస్వామి తండ్రికి సాష్టాంగనమస్కారం చేశాడు. వెంటనే శంకరుడు నీకు సుబ్రహ్మణ్యం అనే పదం జగద్వ్యాప్తి ఆగుగాక అని దీవించాడు. అప్పటినుండి కుమారస్వామి సుబ్రహ్మణ్యస్వామి అయ్యాడు.

ప్రణవంద్వారానే పరమార్థం తెలుసుకుని జ్ఞానబోధ చేసేవాడిగా పేరు తెచ్చుకున్నాడు కుమారస్వామి. అతని టెక్కెళిపై కోడిపుంజు గుర్తు ఉంటుంది. అదికూడా ప్రణవానికి గుర్తు. తన నామం ధ్యానించేవారికి జ్ఞానం కలిగిస్తాడు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారు కైలాసగిరిపర్వతంపై ఉన్న పరమశివుడికి ప్రణవం పరమార్థంగురించి వివరిస్తూ గురు బోధన చేశాడు. ఖగోళశాస్త్రం, బ్రహ్మవిద్య, సాముద్రికశాస్త్రం గ్రహించిన జ్ఞాని. తనకు వచ్చిన జ్ఞానామృతం తండ్రికి వివరించాడు.

తెలిసిన విషయం ఎదుటివారికి తెలియజేయడంలో తప్పు లేదు. దీనిలో తారతమ్యభేదాలు అవసరం లేదు అని కుమారస్వామి అభిప్రాయం. బ్రహ్మవిద్యద్వారా లోకానికి ఒక అపురూపసందేశం అందించారు. పరమశివుడు బోళాశంకరుడు. ఇష్టం వచ్చినట్లు రాక్షసలోకానికి వరాలిచ్చి దేవతలను ఇబ్బందిపెట్టినవిషయంకూడా ఈ జ్ఞానబోధన ద్వారా వివరించాడు. ఖగోళశాస్త్రంద్వారా అద్భుతమైన విషయాలు వివరించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 57 జూలై, 2026 సంచిక : 02



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకులు
శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,
పి.జి.డిప్లొమా ఇన్ జె.ఎం.సి.

ఉపసంపాదకులు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| తండ్రికే గురుస్వామయ్యాడు!! | శ్రీ ఎల్.ప్రఫుల్లచంద్ర | 04 |
| విద్యాగురువు - మహాసరస్వతీదేవి | డా॥ రఘుపతి శాస్త్రుల | 07 |
| రూపాయిహారతి | | 10 |
| మహాభారతంలో వేదవ్యాసమహర్షి | శ్రీ పింగళి పాండురంగారావు | 11 |
| ఈ గురువువల్లనే తిరుమలేశుని ఆవిర్భావం!! | 'ఆంధ్రరత్న' ప్రొ॥జి.వి.శేషారెడ్డి | 13 |
| సందేహాలు-సమాధానాలు | కీ.శే. డా॥ఎస్.బి.రఘునాథాచార్య | 16 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 17 |
| అమరం! కర్ణకథ అజరామరం!! | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 18 |
| అనంతరూపభగవత్కార్యసాధకుడు వాయుదేవుడు | శ్రీ రాచూరి వెంకటరమణ | 20 |
| దక్షిణాయన పుణ్యకాలం | శ్రీమతి వి.శ్రీలక్ష్మి | 23 |
| తిరుమాలిరుంశోలై (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| అవతరించిన వేళ... | | 26 |
| గురువులకే గురువు | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 31 |
| వీణ | భారతజ్యోతి ఆచార్య డా॥ యోగశ్రీ సి.ఎస్.రాయుడు | 36 |
| గుండిచయాత్ర | డా॥యస్.పద్మావతి | 40 |
| శ్రీనివాస విలాస సేవధి (ద్విపద) | సంక్షిప్తవచనం- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 41 |
| వైఖానసం | డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ | 42 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 43 |
| ధర్మరాజు -యమధర్మరాజు | డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి | 44 |
| పుస్తకం మన నేస్తం | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 46 |
| శుభముహూర్తం!! | | 47 |
| నాకు కనువిప్పు కల్గింది!! | శ్రీ జి.ఎస్.కె.సాయిబాబా | 47 |
| గురుదక్షిణ (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.తులసీప్రసాద్ | 48 |
| బాలవినోదం | సేకరణ & నిర్వహణ: మొలకా ఉత్తరఫల్గుణి<br>చిత్రాలు: డా॥ శ్రీధరన్ కొలికి | 50 |
| క్విజ్ | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : ఆణివరఆస్థానంలో ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామివారు, విష్వక్సేనులు, తిరుమల

వెనుకచిత్రం : పూరీ జగన్నాథక్షేత్ర దేవతామూర్తులు బలరాముడు, సుభద్ర, శ్రీకృష్ణుడు (చిత్రకారుడు: శ్రీ కె.తులసీప్రసాద్)

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# అమ్మ ఆశీస్సులు పొందుదాం!!

**"తల్లియే వేదము, తల్లియే శాస్త్రము, తల్లియే దైవము, తల్లియే గురువు, తల్లిని మించిన ధనము మరేమున్నది? తల్లిదీవెనయే తలచిన సర్వము."**

మనకు జ్ఞానాన్ని ప్రసాదించే వేదాలకంటే తల్లి గొప్పది. ఆమె మాటే మనకు వేదప్రమాణం. ఏ శాస్త్రం చెప్పే నీతి ఐనా తల్లినేర్పే సంస్కారంనుండే మొదలౌతుంది. కంటికి కనిపించని దేవునికంటే మనల్ని కని, పెంచిన అమ్మే ప్రత్యక్షదైవం. బిడ్డకు మొదటిపాఠాలు నేర్పే గురువు తల్లి. ఈ లోకంలో తల్లిని మించిన గొప్ప సంపద ఏదీ లేదు. ఆమె ఇచ్చే దీవెనలు అన్నింటికంటే శక్తివంతమైనవి.

గురువులలో పరమగురువు అమ్మ. ఆమె మాటే మంత్రం. ఉగ్గుపాలతో ఉన్నత సంప్రదాయాలను, జీవితంలోని విలువల్ని, నిర్భయాన్ని, నిజాయితీని, సృజనాత్మకశక్తిని పెంపొందించగల అవకాశం తల్లులకు మాత్రమే ఉంటుంది.

అమ్మ మనల్ని కన్నదే కానీ, మనం అమ్మను కనలేము. ఆమె ఈ బ్రహ్మాండంలోని ఒక అద్వితీయమైన శక్తి. ఈ శక్తి నిరంతరం ఒక తరంనుండీ మరో తరానికి, ఒక యుగంనుండీ మరో యుగానికి విద్యుత్తు ప్రవహించునట్లు ప్రవహిస్తూనే ఉంది. ఉంటుంది కూడా! అమ్మ లేకుంటే అమృతం లేదు. ఆనందం లేదు. అమ్మ చెప్పకుంటే ఈ ప్రపంచమే లేదు.

తల్లి మన తొలి గురువు. ఆమె గర్భకోశకాసారంలో మునకవేసి ముముక్షువుగా ఉన్ననాడు ఆమె మౌనంగా మనతో సంభాషిస్తుంది. ఆమె గర్భాశయంనుండి బయటపడగానే ఆమె ప్రత్యక్ష వచనాలను వింటాం. మనం పెరిగేకొద్దీ జీవన తొలిపాఠాలు అమ్మవద్ద నేర్చుకోవాల్సిందే! లోకాన్ని మనం మొదటగా అమ్మ కళ్లతోనే చూస్తాం. మనలో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని, ప్రేరణను మనలో కల్గించే చైతన్యమూర్తి అమ్మే!

బిడ్డ అక్షరాభ్యాసంనాటికి అమ్మ పంతులమ్మగా మారిపోతుంది. అమ్మ ఉన్నత విద్యావంతురాలు కావచ్చు. కాకపోవచ్చు. కానీ, బిడ్డకు అర్థమయ్యేలా చెప్పాలన్న తపనే... విశ్వవిద్యాలయాల్లో తీసుకునే డిగ్రీపట్టాలకంటే అతీతమైన పరిణతిని ఇస్తుంది. అందుకే అమ్మ చెప్పిన పాఠాలు అంతగా గుర్తుండిపోతాయి. అందుకే అమ్మలోని పంతులమ్మకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం. మనసారా చేసే నమస్కారం తప్ప. మనం ఈ విషయంలో జాగరూకత కల్గి తల్లికి సముచితస్థానం కల్పించే దిశగా ఆలోచన కల్గి ఉంటే చాలు. అదే తల్లికి మనం సమర్పించుకునే ఋణం.

ఇతిహాసాలు, పురాణాలు, ఉపనిషత్తులు, వేదాలు వీటన్నింటిలో ఉన్న పురుషులందరూ కూడా తల్లి మాటలతో ప్రేరణ పొంది చిరంజీవులుగా ఆచంద్రతారార్కం చరిత్రలో నిలిచి ఆదర్శనీయులుగా నిలిచిపోయారు. అలా మనమందరమూ మన తల్లులను ఈ గురుపౌర్ణమి నాడు స్మరించి, వారి ఆశీర్వాదాలు పొంది, మన జీవితాల్ని సంతోషంగా, ఆనందంగా సాగించి తరిద్దాం.

# విద్యాగురువు-మహాసరస్వతీదేవి



-డా॥ రఘుపతి శాస్త్రుల, 73867 58370

హంసవాహనిగా ఆరాధింపబడుతుండే సరస్వతీదేవి మనలో ఎల్లప్పుడూ నిక్షిప్తమై ఉండే ఆత్మస్వరూపానికి ప్రతీక. ఆమె జ్ఞాన, గాన, ధ్యానాలు మూర్తీభవించిన దేవతామూర్తి.

ఆమె ఒకచేతిలో వీణనూ మరొకచేతిలో పుస్తకాన్ని ధరించినట్లు కనిపిస్తుంది. అందుకే ఆమెను వీణా పుస్తక ధారిణీం అని ప్రార్థిస్తుంటాం. ప్రాచీన వాయిద్యాలలో ఒకటైన వీణ అనేది సంగీతానికీ, కళలకూ, సృజనాత్మకతకూ ప్రతిరూపంగా ఉంటూ, మనలో కుడివైపులో ఉండే మెదడు చేసే పనులనూ ఉత్తేజపరుస్తుంది. ఎడమచేతిలో ఉండే పుస్తకమనేది మనలో ఎడమవైపున ఉండే మెదడు చేసే కార్యకలాపాలను సూచిస్తుంది. మరొకచేతిలో ఉండే జపమాల జీవితంలోని ధ్యానగుణాన్ని సూచిస్తుంది. ఆ జగన్మాత వాహన మనేది తెల్లనికాంతులను విరజిమ్మే రాజహంస. పాలనూ, నీళ్లనూ వేరుచేసి స్వీకరించగల ఆ పక్షిరాజం మనకు కావలసిన విచక్షణాశక్తిని సూచిస్తుంది. వివిధరకాల జ్ఞానసాధనలు వెల్లివిరిసే చైతన్యస్వరూపమే సరస్వతీదేవి. ఆమె ఆధ్యాత్మిక జ్యోతికి మూలంగా నిలుస్తుంది. అన్ని విజ్ఞానాలను ప్రసాదించే చైతన్యస్వరూపమే ఆ జగన్మాత.

శరదిందు వికాస మందహాసాం
స్ఫురదిందీవర లోచనాభి రామాం
అరవింద సమాన సుందరాస్యాం
అరవిందాసన సుందరీ ముపాస్యే॥

ఆ చదువులతల్లి శారదాదేవిని గురించిన ప్రార్థనా శ్లోకమిది.

ఆ జగన్మాత శరదృతువులోని సప్తమితిథినాటి మూలానక్షత్రంరోజున బ్రహ్మోత్సవాలు జరిగే పర్వదినాలలో అవతరించింది. స్ఫురద్రూపిణిగా ఉండే ఆ వాగ్దేవత శర దృతువులో విరజిమ్మేకాంతులతో, చంద్రుని చల్లదనంతో కూడిన చిరునవ్వులను చిందిస్తూ ఉంటుంది.

వెన్నెల స్వచ్ఛదనానికి ప్రతీక. సూర్యుని ప్రచండమైన కిరణాలను ఆస్వాదించుతూనే ఆ వేడిమినంతా తనలో ఇముడ్చుకొని లోకానికి చల్లదనాన్ని ప్రసాదించే మనోహరమైన రూపమే చంద్రునిది. అలాంటి ఆహ్లాదకరమైన చంద్రుడు ప్రసాదించే వెన్నెలతో చల్లనితల్లి సరస్వతీదేవి చిరునవ్వులను పోల్చారు. ఆ మందహాసం భక్తులను అలరింపజేస్తూ ఆ చూపులు ఎల్లప్పుడూ అనుగ్రహంతో వెల్లివిరుస్తూ ఉంటాయనే పరమార్థం ఇందులో దాగి ఉంది.

సమస్తలోకాలకు జ్ఞానాన్ని ప్రసాదించే ఆ జగన్మాత చూపులేమో స్ఫురత్ ఇందీవరాలవంటి కన్నులనుండి వెలువడేవి. అంటే తళతళమని మెరుస్తూ ఉండే నల్లనికలువపూవులలాగా ప్రకాశించే నేత్రాలతో మనోహరమైన కటాక్షవీక్షణాలతో అనుగ్రహిస్తూ ఉండేవి ఆ సరస్వతీమాత చల్లనిచూపులు.

ఆ కమలగర్భుని రాణి ముఖమేమో అందమైన కమలంలాగా సుందరంగా ఆహ్లాదాన్ని కలిగించేది. కలువల కాంతికి మూలాధారం చంద్రుడైతే కమలాప్తుడే కమలాలు వికసింపజేయడానికి మూలాధారం.

ఈ సృష్టిలో వెలుగొంది జీవించడానికి ఏ సూర్య చంద్రులైతే మూలాధారంగా విరాజిల్లుతూ ఉన్నారో వారి ప్రతీకలుగా చెప్పబడే కమలాలు కలువల పోలిక ఈ శ్లోకంలో సాదృశ్యంగా, సాభిప్రాయంగా ఉల్లేఖించబడింది. సూర్య చంద్రులు ఎలాగైతే ఈ సృష్టిలోని సమస్త ప్రాణికోటివికాసానికి తోడ్పడుతున్నారో అలాగే జీవకోటికి మూలాధారమైన వికాసానికి ఆ చదువులరాణియే ఆధారమౌతుందనే ధ్వని ఇందులో నిక్షిప్తమై ఉంది. అలాంటి అరవిందాసన సుందరీ మణిని అంటే కమలమును ఆసనంగా కలిగి ఈ సమస్తసృష్టికీ సృష్టికారకుడైన ఆ కమలగర్భుని రాణి వాణిని ఎప్పుడూ ఉపాసించుతుంటాడనేది ఈ ప్రార్థనాశ్లోకంలోని పరమార్థం.

**2026, జూలై 29న ఆషాఢపూర్ణిమ సందర్భంగా..**

సరస్+మతుప్, సరః రసః విజ్ఞానం వా విద్యతేఽస్యామ్ అంటే రసము, జ్ఞానము కలది వాగ్దేవి అని సరస్వతీ అనే పేరుకు అర్థాలు. వాక్, బుద్ధి, వివేకం, విద్య, కళలు, విజ్ఞానం- వీటన్నింటికీ అధిదేవతగా మనం ఆ దేవిని ఆరాధిస్తున్నాం. ఆ జగన్మాత హంసవాహనిగా, వీణాపాణిగా, పుస్తక, మాలాధారిణిగా చిత్రీకరింపబడి అరవైనాలుగుకళలకు అధిదేవతగా నిలిచింది. ఆమె ధరించే వీణపేరు కచ్ఛపి.

సరస్వతీదేవి బ్రహ్మదేవుని మానసిక పుత్రిక. అంటే ఆ ఆదిదేవుని మనస్సునుండి పుట్టింది. ఋగ్వేదంలోనూ, దేవీ భాగవతంలోనూ, బ్రహ్మవైవర్తపురాణంలోనూ, పద్మపురాణంలోనూ సరస్వతీదేవినిగురించి వివిధ కథనాలున్నాయి. ఆ మహాదేవి ఆద్యంతరహితమైన శక్తిస్వరూపిణి. బ్రహ్మ సకల సృష్టికర్త గనుక సరస్వతీదేవినికూడా బ్రహ్మయే సృష్టించాడనీ, సృష్టి కార్యంలో తనకు తోడుగా ఉండడానికి తన జిహ్వపై ఆమెను నిలుపుకున్నాడనికూడా ఒక కథనం. సృష్టికార్యాన్ని నిర్వహించడానికి బ్రహ్మకు శక్తిస్వరూపిణిగా సరస్వతీదేవిని శ్రీమాతాదేవి ప్రసాదించిందని దేవీభాగవతం చెప్తోంది.

శ్రీకృష్ణుడు ఒక కల్పంలో తన శరీరంలోంచి సరస్వతీ దేవిని సృష్టించినపుడు దేవతలు మాట్లాడలేనిస్థితిలో ఉంటే వాళ్లందరూ ఆ అమ్మని మౌనంగా ప్రార్థన చేయడంతో ఆ అమ్మవారు వాళ్లందరికీ వాక్కుని ప్రసాదించిందనికూడా దేవీ భాగవతం చెప్తోంది. ఆ సందర్భంలోనే సరస్వతీదేవికవచాన్ని కూడా రచించి, సరస్వతీదేవిపూజ ఎలా చేయాలో కృష్ణుడే స్వయంగా మొదటగా పూజచేసి తెలియజేశాడనికూడా చెప్తారు.

వాక్, బుద్ధి, వివేకం, విద్య, కళలు, విజ్ఞానం- వీటన్నింటికీ అధిదేవతగా సరస్వతీదేవిని మనం పూజిస్తున్నాం. ఈ అమ్మవారు హంసవాహనిగానూ, వీణాపాణిగానూ, పుస్తక మాలాధారిణిగానూ వర్ణింపబడుతుంది.

సరస్వతీదేవి వర్ణనలలో తెలుపుదనానికి చెందిన వస్తువులపోలికలే ఎక్కువగా కనపిస్తుంటాయి. అందుకే ఆమె తెల్లనికాంతులతో విరజిమ్మే హంసను వాహనంగా చేసుకొని "హంసవాహనీ" ఐంది. "సర్వ శుక్లా సరస్వతీ" అనేది జ్ఞాననిధి సరస్వతీదేవియొక్క అత్యంత పవిత్రమైన, స్వచ్ఛమైన తెల్లని రూపాన్ని వర్ణించే మంత్రం లేదా స్తోత్రపాదం. ఇది అజ్ఞానాన్ని తొలగించి, పవిత్రమైన జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతీదేవి రూపానికీ ప్రతీకగా నిలిచింది.

**"చతుర్ముఖ ముఖాంభోజ వన హంస వధూర్మమ,**
**మానసే రమతాం నిత్యం "సర్వ శుక్లా సరస్వతీ॥"**
**(శ్రీ సరస్వతీ రహస్యస్తోత్రం-12)**

బ్రహ్మదేవుని ముఖారవిందం అనే పద్మవనంలో విహరించే హంసవంటి తెల్లనిరూపాన్ని కలిగి, స్వచ్ఛమైన జ్ఞానస్వరూపిణి అయిన ఓ సరస్వతీమాతా! నన్ను అనుగ్రహిస్తూ నా మనస్సులో ఎల్లప్పుడూ నివసించుతుండవమ్మా అనేది ఈ శ్లోకంద్వారా మనం చేసే వేడికోలు. ఇది సరస్వతీ రహస్యోపనిషత్తులోని ప్రార్థనాశ్లోకం. ఇదే శ్లోకాన్ని దండి మహాకవి తన కావ్యాదర్శంలోనూ పేర్కొన్నాడు. ఆ వాగ్దేవిమాత- విద్య, తెలివితేటలు, జ్ఞానం మరియు సృజనాత్మకతకు ప్రతీక. శుభ్రతకు, జ్ఞానానికి నిదర్శనంగా సరస్వతీదేవి తెల్లనిచీరలో, తెల్లనిహంసపై, తెల్లనిపద్మంపై ఆసీనురాలై ఉంటుంది

**"సరస్వతీ మహం వందే వీణా పుస్తక ధారిణీమ్**
**హంస వాహ సమాయుక్తాం విద్యా దాన కరీం మమ" 1**

ఇది యాజ్ఞవల్క్యుడు చెప్పిన శ్రీ సరస్వతీదేవి ద్వాదశ నామస్తోత్రంలోని మొట్టమొదటి ప్రార్థనాశ్లోకం. ఒకవైపు వీణను మరొకవైపు పుస్తకాన్నీ ధరించి తెల్లనిహంసపైన ఆసీనురాలైన ఓ సరస్వతీమాతా! ఓ చదువులతల్లీ! నాకు సమస్తవిద్యలను ప్రసాదించుమని అర్థించే ప్రార్థనాశ్లోకం. ఆమె ధరించేవి బ్రహ్మదేవుని ముఖారవిందం అనే పద్మవనంలో విహరించే హంసవంటి తెల్లనివస్త్రాలు. ఆసీనురాలై ఉండేది తెల్లనిహంస పైన. తెల్లదనం స్వచ్ఛదనానికీ ప్రతీక.

అంధకారం నల్లనిరూపానికీ, అజ్ఞానానికీ ప్రతీక ఐతే తెల్లదనమనేది కాంతికీ, జ్ఞానానికీ, స్వచ్ఛదనానికీ ప్రతీక. అందుకే మనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగింపజేసి జ్ఞానపు వెలుగులను ప్రసాదింపజేయడానికే మనం ఆ విద్యాదేవిని ఆరాధించుతుంటాం.

**"యావేదాంతార్థ తత్త్వైక స్వరూపా పరమేశ్వరీ" (2)**

ఆ జగన్మాత వేదాంతార్థ తత్త్వైక స్వరూపిణి. చతుర్వేదాల అర్థాలకూ, ఉపనిషత్తుల తత్త్వాలకూ ఆమెనే ప్రతిరూపం.


కష్టాలు ఏవైనా ఒంటరిగానే ఎదుర్కోవాలి

"వర్ణ పద వాక్యార్థ స్వరూపేణైవ వర్తతే" (4)

ఇవన్నీ సరస్వతీదేవి రహస్యోపనిషత్తులో చెప్పబడిన శ్లోకాలు.

మనం ఉచ్చరించుతున్న అక్షరాలూ, శబ్దాలూ, వాక్యాలూ అన్నీ ఆ భాషారూపిణిస్వరూపంగానే వర్తించు తుంటాయి. ఆ వాగ్దేవి అనుగ్రహం లేకుండా మన మనస్సులో ఉన్న ఏ అర్థాలనూ, ఏ వాక్యాలనూ, ఏ భావాలనూ మనం వ్యక్తీకరించలేం. మన మనస్సులో ప్రభవించే భావాలకూ వాటి అభివ్యక్తీకరణానికీ ఆమెనే మూలాధారం. అలాంటి ఆ జగన్మాత జ్ఞానం, సంగీతం, కళలు మరియు సకలవిద్యలకూ అధిదేవత. తెల్లనివస్త్రాలు ధరించి, హంసవాహనంపై వీణాపాణిగా, పుస్తక ధారిణిగా దర్శనమిచ్చే ఈ తల్లి, నవరాత్రులలో మూలానక్షత్రం రోజున ప్రత్యేకంగా పూజింపబడుతుంది. సరస్వతీదేవి బ్రహ్మ దేవేరిగా, గాయత్రీ, సావిత్రీరూపాల్లో మరియు మహాసరస్వతీ దేవిగా, శారదాంబగా వివిధరూపాల్లో కొలువబడుతుంది.

అగస్త్యమహర్షి తన సరస్వతీస్తోత్రంలో ఆ సరస్వతీ మాతనుగురించి ఇలా చెప్పాడు–

"యా కుందేందు తుషార హార ధవళా యాశుభ్ర వస్త్రావృతా
యా వీణా వర దండమండిత కరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైః సదా పూజితా
సామాంపాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా" (1)

ఎవరైతే తెల్లని మొల్లపూవులఆకారంలోనూ, మంచు తుంపరలవంటి తెల్లనిఆకారంతోనూ ఉండి తెల్లనికాంతులతో విరజిమ్మే వస్త్రాలను ధరించి ఉంటారో, వీణాపాణిగా తెల్లని కమలాన్ని ఆసనంగా కలిగి ఉంటారో, ఎవరైతే త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరాది సమస్తదేవతలతో ఆరాధింపబడు తుంటారో, అజ్ఞానాన్ని తొలగింపజేసే ఆ సరస్వతీదేవి ఎల్లవేళలా మమ్మల్ని రక్షించాలని కోరుతూ ఉండే స్తోత్రమిది. ఇందులోనూ తెల్లనిరంగుతో అలరారుతుండే ఉపమానాలే మనకు దర్శన మిస్తుంటాయి.

"దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటిక మణి నిభైః రక్షమాలా దధానా
హస్తేనైకేన పద్మం సితమపిచ శుకం పుస్తకం చాపరేణ
భాసా కుందేందు శంఖ స్ఫటిక నిభా భా సమానాఽసమానా
సామే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా"॥(2)



సూర్యకాంతమణులవంటి తెల్లని తేజస్సు కలిగి, జప మాలనూ, తెల్లనిపద్మమూ, రాచిలుకతోనూ, పుస్తకంతోనూ అలరారుతూ నాలుగుచేతులతో ఒప్పుతూ ఉండే సుప్రసన్న ఐన సరస్వతీమాత నా జిహ్వాగ్రంపైన నివసిస్తూ నాకు వాగ్విన్యాసాన్ని ప్రసాదిస్తూండాలనే అభ్యర్థన ఇందులో ఇమిడి ఉంది.

"సరస్వతీ సరసిజ కేసర ప్రభా
తపస్వినీ సిత కమలాసన ప్రియా
ఘన స్తనీ కమల విలోల లోచనా
మనస్వినీ భవతు వరప్రసాదినీ" (4)

ఆ జగన్మాత తెల్లని కమలాలలో ఉండే కేసరముల వంటి కాంతితో అలరారుతుంటుందని ఇందులోనూ చెప్ప బడింది.

"మహాదేవ్యై మహా కాళ్యై మహా లక్ష్మై నమోనమః
బ్రహ్మ విష్ణు శివాయైచ బ్రహ్మ నార్యై నమో నమః॥" (18)

ఆ విద్యాదేవి సర్వశక్తిస్వరూపిణిగానూ, మహాకాళీ, మహాలక్ష్మీరూపిణిగానూ ఇందులో చెప్పబడింది.

ఇవన్నీ అగస్త్యమహర్షి ప్రోక్తమైన ప్రార్థనాశ్లోకాలు.

"శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుంద మం
దార సుధా పయోధి సిత తామర సారస వాహినీ శుభా
కారత నొప్పు నిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు భారతీ!"
(మహాభాగవతం-1-8)

అని బమ్మెర పోతనామాత్యుడు తన భాగవతంలో చెప్పుకొచ్చాడు.

"సర్వ శుక్లా సరస్వతీ" అని ప్రార్థింపబడుతూ నిలువెల్లా తెల్లదనంతో అలరారుతూ ఉండే ఆ చదువులతల్లిని "శరత్కాలములోని మేఘమూ, చంద్రబింబమూ, కర్పూరమూ, నీటి నురుగు, వెండికొండ, రెల్లుపూలూ, మల్లియలూ, మందారాలూ, అమృతసముద్రమూ, తెల్లనితామరలతో అలంకరింపబడి ప్రవహించే తెల్లని గంగానది" వంటి తెల్లనిరంగులో ప్రకాశించే చక్కని ఉపమానాలతో పోల్చుతూ ఆ మహాకవి సరస్వతీదేవిని వర్ణించాడు.

అలాంటి శుభప్రదమైనస్వరూపంలో ఉండే జగన్మాతను తన గుండెగుడిలో ప్రతిష్ఠించుకొని చూడగలుగడం ఎన్నటికి సాధ్యమౌతుందో కదా అని ఆ కవీంద్రుడు ప్రాధేయపడుతూ తపించడం ఈ ప్రార్థనలో కనిపిస్తుంది.

సరస్వతీదేవి అంటే పరాశక్తియొక్క గురురూపం. వైదిక ధర్మంలో ఏ ఉపాసన చేసినా ప్రధానమైన దేవతలు ముగ్గురు- సదాశివుడు, మహావిష్ణువు, పరాశక్తి. ఆయా దేవతలకు సంబంధించిన గురురూపాలు ప్రధానంగా ఉంటాయి. సదాశివ గురురూపం దక్షిణామూర్తి. మహావిష్ణువు గురురూపం హయగ్రీవుడు. పరాశక్తి గురురూపం సరస్వతీదేవి.

బుద్ధిని, విద్యను, జ్ఞానాన్ని ప్రసాదించి తనను పూర్తి శరణాగతితో ఆరాధించేవారికి యుక్తాయుక్తవిచక్షణాజ్ఞానాన్ని వివేచనాశక్తిని, జ్ఞాపకశక్తిని, కల్పనానైపుణ్యాన్ని, కవితాస్ఫూర్తిని, రచనాశక్తిని, ధారణాశక్తిని ప్రసాదించే కరుణామయి మహాసరస్వతీదేవి.



# రూపాయిహారతి!!

ఈ ఉత్సవంరోజున ఉదయం బంగారువాకిలిముందు గల ఘంటామండపంలో సర్వభూపాలవాహనంలో ఉభయదేవేరులతో శ్రీమలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరోపీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతోపాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో "పరివట్టం"(చిన్నపట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారిద్వారా బియ్యపుదక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యో భవ' అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల పెద్దజియ్యరుస్వామివారికి, చిన్నజియ్యరుస్వామివారికి, తి.తి.దే. తరపున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపు చెవిగుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపుచెవిగుత్తిని శ్రీవారిపాదాలచెంత ఉంచుతారు. ఈ ఉత్సవానికి తిరుమలలో ఒక ప్రత్యేక విశిష్టత ఉంది.

ఆ రోజున స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులందరి తరపున ఒక్కొక్కరూపాయి వసూలుచేసి "రూపాయిహారతి" ఇవ్వబడుతుంది. ఈ హారతికి వసూలుకాబడిన రూపాయలను వెంటనే కార్యనిర్వాహకులసమక్షంలో జమ చేయబడుతుంది. ఆ తర్వాత మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. ఆ సాయంత్రం శ్రీదేవి, భూదేవిసమేత శ్రీమలయప్ప స్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకిపై తిరుమల పురవీధులగుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు. ఈ విధంగా సాలకట్ల ఆణివర ఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహిస్తారు.



జూలై 17, 2026న శ్రీవారి ఆణివరఆస్థానం & శ్రీవారి పుష్పపల్లకిసేవ సందర్భంగా...

మన మహర్షులు

# మహాభారతంలో వేదవ్యాసమహర్షి

- శ్రీ పింగళి పాండురంగారావు, 94405 54114

**2026, జూలై 29న వ్యాసపౌర్ణమి సందర్భంగా...**

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥

హైందవసంప్రదాయంలో వేదాలను నాలుగు భాగాలుగా విభజించిన కృష్ణద్వైపాయనుడుగా ప్రసిద్ధికెక్కినవాడే వ్యాసుడు. వేదాలను విభజించినందున ఆయన వేదవ్యాసుడైనాడు. అంతేకాదు, వేదాలతోపాటు మహాభారతం, భాగవతం, అష్టాదశపురాణాలను వ్యాసుడు రచించాడు. వ్యాసుడు సప్త చిరంజీవులలో ఒకడని ప్రసిద్ధి.

వ్యాసుడు జన్మించిన తరువాత తల్లి అనుమతితో తపోవనానికి వెళ్ళిపోయాడు. ఆ పిమ్మట సత్యవతీ శంతనుల వివాహం జరిగింది. వీరిద్దరి వివాహసమయంలో దాశరాజు విధించిన షరతులమూలంగా భీష్ముడు ఆమరణాంతం బ్రహ్మచర్యవ్రతం అవలంబిస్తానని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. శంతనుడు చనిపోయినతర్వాత వారి కుమారులైన చిత్రాంగదుడు బలగర్వంతో గంధర్వునిపై యుద్ధానికి వెళ్ళి అతని చేతిలో మరణించాడు. విచిత్రవీర్యుడు సుఖలాలసతో అకాల మరణం పొందాడు. ఇలా భరతవంశం వారసులను కోల్పోయినతరుణంలో సత్యవతి భరతవంశ పునరుద్ధరణకోసం తన పుత్రుడైన వ్యాసుని మననమాత్రంచేత తనవద్దకు రప్పించుకొంది. భరతవంశాన్ని నిలిపి, కాపాడమని వ్యాసుని ఆదేశించింది. తల్లి



ఆజ్ఞను పాటించి వ్యాసుడు అంబికకు ధృతరాష్ట్రుని, అంబాలికకు పాండురాజును మరియు దాసికి విదురుని ప్రసాదించి తిరిగి తపోవనానికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత వ్యాసుడు గాంధారి గర్భస్రావసమయంలో వచ్చి, గాంధారి మృతపిండం నూటఒక్క నేతికుండలలో పెట్టి, వాటిని పరిరక్షించే పద్ధతిని చెప్పి, తిరిగి తనమార్గాన తాను వెళ్ళిపోయాడు. దుర్యోధనుడు భీమునిపై మూడుసార్లు హత్యాప్రయత్నం చేసినతరువాత తన తల్లికి కురువంశంలో రాబోయే ఘోర దుష్పరిణామాలను తెలియజేసి, వాటిని ఆమె తట్టుకోవడం కష్టమని తపోవనానికి వెళ్ళి, విశ్రాంత జీవితం గడపమని తెలియజెప్పి మరల తనదారిన తాను వెళ్ళిపోయాడు.

ఆ తరువాత లక్కఇంటిదహనం, పిమ్మట హిడింబాసురుని మరణానంతరం హిడింబి భవిష్యసూచనపై శాలిహోత్రుడు నివసించిన ఆశ్రమప్రాంతంలో పాండవులు నివసించేసమయంలో వ్యాసుడు పాండవులదగ్గరకు వచ్చి వారిని ఓదార్చాడు. ఆ ఆశ్రమమాహాత్మ్యాన్ని ఇలా చెప్పాడు. అక్కడి సరస్సులోని నీరు త్రాగినవారికి ఆకలిదప్పికలుండవు, ఆ వృక్షాల క్రింద నివసించేవారికి పైత్య, వాత, పక్ష, ఆతప భయములుండవు అని చెప్పాడు. హిడింబి భీముని వివాహమాడమని కోరగా, సంశయిస్తున్న కుంతీదేవిలోని సంశయాన్ని నివారించి, హిడింబి పతివ్రత అని, ఆమెవల్ల కలగబోయే సంతానం ద్వారా పాండవులకు మేలు జరుగుతుందని చెప్పి, తనదారిన మళ్ళీ తాను వెళ్ళిపోయాడు.

ఆ తరువాత కొంతకాలానికి, ద్రౌపదీ స్వయంవరానికి ముందుగా పాండవులకు దర్శనమిచ్చి, వారికి ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతాన్ని

వివరించి, స్వయంవరానికి వెళ్ళమని, శుభం కలుగుతుందని చెప్పి, స్వయంవరం, వివాహం ముందుగానే గ్రహించినవాడై, వారికి సూచించి అంతర్ధానమైనాడు.

శ్రీమహావిష్ణువు అంశగా జన్మించి (ఆషాఢపౌర్ణమి నాడు) సకల కళానిధియై వేదములను విభజించిన మహా విద్యావేత్త సద్గురువు వేదవ్యాసుడే గదా! ఆయన శస్త్రచికిత్స వేత్త కూడ. గాంధారి కుంతిదేవిపై అసూయతో తాను దిగజార్చుకొన్న గర్భస్థపిండాన్ని పరిరక్షించి, అందులో, నూట ఒక్క శిశువులు ఉండటం గుర్తించి, నేర్పుతో ఆ పిండాన్ని విభజించి, నేతికుండలలో నిక్షిప్తం చేసి, పోషింపజేసి, జీవ మిచ్చిన వైద్యుడు.

వైద్యవిద్యానిధి, మేధోనిధి, ఆత్మవిద్యానిధి అయిన వ్యాసభగవానుని ఆరాధించుటకు ఉద్దేశింపబడిన పర్వదినమే గురుపౌర్ణమి.

వ్యాస జన్మదినమైన గురుపూర్ణిమరోజు కర్మ, జ్ఞాన, భక్తిమార్గాలలో గురువును పూజించడం మహర్షులు ఆచరించి చూపించారు. శిష్యుడు ఏదైనా తప్పు చేస్తే, గురువు మాత్రమే కాపాడగలడు. దైవంకూడ రక్షించలేడు. దైవాపచారం చేస్తే గురువు కాపాడగలడు, అదే గురువుకు కోపం వస్తే, ముల్లోకాల్లో ఎవరూ రక్షించలేరు.

జ్ఞానప్రదాత అయిన గురువును సేవించి, గురుకృప పొందిన మహనీయులు ఎందరో ఉన్నారు. గురువులు మనలోని అజ్ఞానాన్ని హరింపచేసి, జ్ఞానాన్ని ప్రసాదిస్తారు. ఆ కారణం గానే, జ్ఞానవంతులైన ఆదిశంకరులుకూడ గురువును ఆశ్రయించారు. అంతెందుకు, సాక్షాత్తూ అవతారపురుషులైన శ్రీకృష్ణబలరాములుకూడ సాందీపనిమునివద్ద ఆశ్రమంలో ఉన్నారు. ధర్మరాజు భీష్ముడిని గురువుగా భావించి, ఎన్నో ధర్మ సూక్ష్మాలను తెలుసుకొన్నాడు. భగవద్గీతలో చెప్పినట్లు గుర్వనుగ్రహం తత్త్వదర్శనకారి.

## గురుపౌర్ణమి

గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను పూజించే గురుపౌర్ణమిరోజును వ్యాసపూర్ణిమ అని పిలుస్తారు.

హిందువులు ప్రతిసంవత్సరం ఆషాఢశుద్ధపౌర్ణమి రోజున గురుపూర్ణిమ జరుపుకుంటారు. ఈ రోజున గురు పూజోత్సవం జరిపి, గురువుకు కానుకలు, బహుమతులు సమర్పించి, వారిని సత్కరిస్తారు. వారి ఆశీర్వాదాలు తీసు కుంటారు.

తమ జీవితానికి మార్గనిర్దేశం చేసి, ముక్తిమార్గంవైపు తమను నడిపించినందుకు ప్రతిఫలంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. శిష్యులకు గురువులపట్ల ఈ విధేయతే ఎల్లవేళలా ఉంటున్నప్పటికీ, ఈ రోజు వ్యాసమహర్షి జన్మించిన శుభకరమైన రోజు కాబట్టి, ఈ రోజుకు అంత ప్రాధాన్యత చేకూరింది.

చాలమంది ఈ రోజున ఉపవాసముంటారు. సూర్యోదయంవేళ ఉపవాసం ప్రారంభించి, చంద్రోదయసమయానికి ముగిస్తారు. చంద్రోదయాన్ని వీక్షించి, సాయంత్రం గురుపూజను నిర్వహించిన తరువాత ఉపవాసదీక్ష ముగించుకొని ఆహారం స్వీకరిస్తారు.

గురువు అంటే ఆధ్యాత్మికజ్ఞానాన్ని బోధించే మహాను భావుడు. చాలమంది హిందువులు తమ తమ గురువులతో జీవితాంతం సంబంధబాంధవ్యాలు కొనసాగిస్తూ ఉంటారు. ఇలా కుటుంబసంబంధంకూడ ఏర్పడవచ్చు. తరతరాలూ కొనసాగవచ్చు. హిందూమతంలో గురువును భగవంతునికి, భక్తునికి మధ్య సంధానకర్తగా భావిస్తుంటారు. వేదవ్యాసమహర్షి మానవజాతికంతటికి ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రసాదించి, నిర్గమించాడు. కనుక ఆయన్ని మానవజాతి యావత్తు గురువుగా భావిస్తుంది. వేదవ్యాసుని పూర్వనామం కృష్ణద్వైపాయనుడు. వేదాలను సంకలనం చేయడంతో ఆయన్ను వేదవ్యాసుడు అని పిలవటం ప్రారంభించారు.

నేడు క్షీణించిపోతున్న మన ఆర్యజీవన దృక్పథం పునరుజ్జీవనం పొందాలంటే, మన మహర్షుల చరిత్రలే మనకు ఏకైక ఆధారం, శరణ్యం. నేడు మనలో దైవభక్తి ఉంది, కాని అది సాంప్రదాయఅవగాహన, ధార్మికజీవనంలోని శ్రద్ధలేని అజ్ఞానంతో కూడి ఉంది. దీనికి ఒకటే చికిత్స లేక ప్రతిక్రియ ఏమంటే మనం మహర్షుల స్మరణ, వారి జీవితాలు, తపస్సులు, ఆనాటి జీవనవిధానాలు, వారి వారి దృక్పథాలను మనం అవగాహన చేసుకొంటే, నేటి మన హిందూమతవైభవం జ్ఞానవంతమై, ధర్మపూర్ణమై, నిజమైన సనాతన భారతీయత పునరుజ్జీవనం పొందుతుంది. తేజోవంతమవుతుంది. స్వస్తి.

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే,
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః



# ఈ గురువువల్లనే తిరుమలేశుని ఆవిర్భావం!!

-'ఆంధ్రరత్న' ప్రొ॥జి.వి.శేషారెడ్డి, 80748 26819



గురువు అంటే అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే మార్గదర్శకుడు. ముఖ్యంగా గురుపౌర్ణమి రోజున గురువులను పూజిస్తాం. 'గు' అంటే చీకటి, 'రు' అంటే తొలగించేవాడు."గురు బినా గ్యాని నహిం" అనే సామెత గురువు ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఎవరిసమక్షంలో మనకు అనూహ్యమైన ప్రశాంతత కలుగుతుందో, మన మనసు భయరహితంగా మారి విశ్రాంతి పొందుతుందో ఆ వ్యక్తే మన గురువు.

బ్రహ్మదేవుని హృదయంనుండి జన్మించిన నవ బ్రహ్మలలో భృగుమహర్షి ఒకరు. సరస్వతినదీతీరంలో ఒకరోజు మహర్షులందరు మహాక్రతువు నిర్వహిస్తుండగా త్రిమూర్తులలో ఎవరు గొప్ప? అనే ప్రశ్న వాళ్ళలో ఏర్పడింది. లోకకల్యాణం



కొరకై యజ్ఞం తలపెట్టిన మహర్షులు త్రిమూర్తులలో గొప్పవారెవరో నిర్ణయించమని భృగుమహర్షిని పంపారు.

అరికాలిలో నేత్రం కారణంగా తనకి గల శక్తిపట్ల గర్వితుడై ఉన్న భృగుమహర్షి తొలుత సత్యలోకాన్ని చేరాడు. వేదగానం చేస్తూ బ్రహ్మదేవుడు, ఆయన గాత్రానికి వీణానాదాన్ని అందిస్తూ సరస్వతీదేవి సంగీతంలో సంలీనులై ఉన్నారు. ఆలుమగలిద్దరూ ఒకే అనుభూతిలో లయించి ఉండగా ఆ




అనునాదం అనంతమై విస్తరించింది. భృగురాక వారిని ఆటంక పరచలేదు. దాంతో వారు ఆయనరాకకి స్పందించలేదు. అది చూచి కోపంతో బ్రహ్మకు భూలోకంలో ఆలయాలుండవని శపించాడు భృగువు.

భృగువు నేరుగా కైలాసానికి వెళ్ళాడు. కైలాసంలో శివపార్వతులు నాట్యంలో లీనమై ఉన్నారు. ఆదిదంపతులతో బాటు గణపతి, కుమారస్వామిసహితంగా నందీ, భృంగీ, రుద్రగణాలు ఆ పారవశ్యంలో ఉన్నారు. ఇక్కడా భృగు మహర్షికి స్వాగతసత్కారాలు లభించలేదు. పార్వతీపరమే



శ్వరులు తాళం తప్పకుండా చేస్తున్న నాట్యం సర్వసృష్టికీ శృతిలయలై ఉంది. అహంకారరహితుడై ఉండిఉంటే భృగుమహర్షి, ఆదిదేవుడు నాట్యమాపి తనని పలకరించేవరకూ సహజంగా, భక్తిగా, వేచి ఉండేవాడు. కానీ భృగువుకి అదనపుశక్తి ఉంది. దాని తాలూకూ అహంకారమూ ఉంది. కాబట్టి భక్తుడు భగవంతుడికోసం వేచి ఉండటం కాదు, భగవంతుడే భక్తుడిరాకకోసం మెళకువతో ఉండాలనుకున్నాడు. దాంతో ఆగ్రహన్ని నిగ్రహించుకోలేక లింగాకృతికే తప్ప పరమేశ్వరుడిరూపానికి అర్చనలుండరాదని శపించాడు.

ఆ తర్వాత వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ లక్ష్మీ నారాయణులు సరసవినోదంలో ఉన్నారు. సత్యలోకంలో బ్రహ్మ సరస్వతుల హృదయాలు సంగీత భరితమైతే, కైలాసంలో శివపార్వతుల తనువులు నాట్యగతిలో లయించి ఉన్నారు. వైకుంఠంలో లక్ష్మీవిష్ణువులు పరస్పరం సరససంభాషణలో మునిగి ఉన్నారు. 'సృష్టి స్థితి లయకారులం కదా' అని త్రిమూర్తుల్లో ఎవరూ ఇల్లాలితో గడపటానికి సమయం లేదు. అనలేదు. అనుకోలేదు. సరసవినోదంలో మునిగిఉన్న శ్రీహరి శ్రీదేవిలను చూశాడు భృగువు. అప్పటికే ఆగ్రహం హద్దులు దాటి ఉంది. పాదంతో మహావిష్ణువు వక్షఃస్థలంపై తాకాడు. గుండెలపై తాకిన బిడ్డణ్ణి చూసిన తండ్రిలా శాంతంగా చిరునవ్వు నవ్వాడు శ్రీహరి! భృగువుని బుజ్జగిస్తూ, అతిథిసత్కారాల్లో భాగంగా అర్ఘ్యపాద్యాలు సమర్పిస్తూ భృగువు అరికాలిలోని నేత్రాన్ని చిదిమివేశాడు. అప్పటికి కానీ భృగుమహర్షి తలకెక్కిన అహంకార మహమ్మారి దిగిపోలేదు, చేసిన తప్పిదాలు తెలిసి



రాలేదు, పోగొట్టుకున్న తపశ్శక్తి నష్టం అర్థం కాలేదు. దాంతో దిమ్మతిరిగి వాస్తవంలోకి వచ్చిపడ్డ భృగువు, దుఃఖిస్తూ శ్రీవారి పాదాలపై పడ్డాడు. ఆపైన పశ్చాత్తప్తుడై తపోవనానికి తరలి పోయాడు.

అతణ్ణి ఆశ్వీదించి తిరిగి చూసిన శ్రీవారికి, ఎదురుగా శోకమూర్తియై శ్రీలక్ష్మి నిలిచి ఉంది! తన నివాసస్థానమైన



మహావిష్ణువు వక్షఃస్థలంపై తన్నిన భృగువుని విష్ణువు శిక్షించకుండా సమాదరించి పంపినందుకు ఆ తల్లి అవమానం

## శ్రీపదకేళి

### :: 126 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 శ | 2 య | సై | 3 కా | ద | 4 శి | | 5 గు |
| 6 వా | | తి | | ఖీ | | బి | | రు |
| 7 తా | ర | | 8 మ | యు | డు | | | పూ |
| పి | | 9 వ | | డు | | 10 కం | | ర్ణి |
| | 11 పూ | రు | డు | | 12 చం | ద | మా | మ |
| 13 అ | | డు | | 14 యో | | ళి | | |
| 15 నా | భి | | 16 భ | గి | ని | | 17 అ | 18 త్రి |
| మి | | 19 కో | | నీ | | 20 శ | | జ |
| 21 క | ళా | వ | తి | | 22 రు | చి | | ట |



కోరుకున్నది సులభంగా లభిస్తే దానిపట్ల నిర్లక్ష్యం కల్గుతుంది

పదింతలైనట్లుగా పరితపిస్తోంది. అనునయించబోయిన శ్రీమన్నారాయణుడికి శ్రీదేవి శోకాశ్రువులే సమాధానం చెప్పాయి. బాధాతప్తయై, ఆ ఇల్లాలు కన్నీటితో భర్తని విడిచి పోయింది. సిరి తనతో ఉన్నప్పుడు సర్వసంపదలతో వైభవ మూర్తియై విలసిల్లిన శ్రీమన్నారాయణుడు, సిరిదేవి విడిచి వెళ్ళటంతో దరిద్ర నారాయణుడై అడవులు బట్టి పోయాడు.

గుక్కెడుపాలకి పుట్టలో ఉండి. పొదుగు వదలిన గోమాత పుణ్యాన కడుపు నింపుకున్నాడు. దేశదిమ్మరిలా తిరుగుతూ వకుళమాతని చేరినప్పుడు సైతం "ఎవరు నాయనా నీవు?" అంటే "ఏ పేరని చెప్పను? ఏ పేరుతో పిలిచినా



పలుకుతాను. ఏ ఊరని చెప్పను? అన్ని ఊళ్ళు నావే! సిరియు నుండె తొల్లి. ఇప్పుడు తొలగిపోయినది" అన్నాడు. ఆ తల్లి జాలిపడుతూ "అంతే నాయనా లోకరీతి! భాగ్యమున్నంతకాలం అందరూ గౌరవిస్తారు. కలిమి కోల్పోయిననాడు అన్నీ కోల్పోయినట్లే!" అంటూ కన్నబిడ్డ నాదరించినట్లు ఆదరించింది. ఆశ్రమవాసియై, వరాహమూర్తి అనుమతి పొంది, ఆశ్రితుడై జీవిస్తూ ఆకాశరాజపుత్రి పద్మావతిని పరిణయమాడాలనుకుంటే పైసలేవీ? పెళ్ళి చేసుకునేందుకు వడ్డీకి అప్పు తీసుకోవాల్సి వచ్చింది. ఒకప్పుడు సిరిసంపదలకి నెలవైనవాడు! కలకంఠ కంట కన్నీరొలికితే అదీ పరిస్థితి! "కట్టుకున్న ఇల్లాలి కంట కన్నీరు చిందితే ఆ ఇంట సంపదలు నిలబడవు" అంటారు. ఆ తర్వాత ఏడుకొండలెక్కి తిరుమల చేరుకున్నాడు.

అలా స్వామివారు కలియుగదైవంగా భక్తుల కోరికలు తీర్చటానికి, కష్టాలు తొలగించటానికి ఏడుకొండలెక్కి



వరాహమూర్తి అనుమతితో ఏడుకొండలపై శ్రీవేంకటేశ్వర స్వామిగా ఆవిర్భవించాడు. అలా భృగుమహర్షివల్లనే కలియుగ దైవమైన శ్రీనివాసుడు, ఏడుకొండలవాడు, గోవిందుడు ఏడు కొండలపైన వెలశాడు.





# సందేహాలు సమాధానాలు

- కీ.శే. డా॥ఎస్.బి.రఘునాథాచార్య

**ప్ర** మొదట్నుంది నేను చాలా ఆదర్శాలతో జీవించాను. ధర్మంగా నడిచాను. ధర్మమార్గాభ్యుదయానికి, సమాజ శ్రేయస్సుకు కృషి చేశాను. పేరుప్రతిష్ఠలు సంపాదించాను. క్లిష్టపరిస్థితి వచ్చింది. ఇప్పుడు నిలబడలేనేమో! ధర్మాన్ని తప్పుతానేమో ! ఆదర్శాన్ని పోగొట్టుకుంటానేమోనని భయం. ధర్మాన్ని తప్పి అప్రతిష్ఠను భరించడమా? లేక ధైర్యంగా పరిస్థితిని ఎదుర్కోవడమా ?

**జ)** అకీర్తిం చాపి భూతాని కథయిష్యన్తి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తిర్మరణాదతిరిచ్యతే॥ 2-34

నీవు ఇంతవరకు జీవితంలో సంపాదించిన పేరుప్రతిష్ఠలు ఒక ఎత్తు, ఇపుడు ఆదర్శాలను కోల్పోయి, ధర్మం తప్పినవాడని పొందే అప్రతిష్ఠ ఒక ఎత్తు. నీకున్న పేరుప్రతిష్ఠలను ప్రజలు గుర్తిస్తారో లేదో కాని, నీకు ఇపుడు కలిగే అపకీర్తిని మాత్రం అందరు తప్పక గుర్తు పెట్టుకుంటారు. ఒకసారి జీవితంలో చక్కని గౌరవం పొందినవారు తిరిగి అగౌరవం పొందడం మరణంకంటే నీచమైన విషయం. అది చాలా బాధాకరం. కనుక ధర్మాన్ని తప్పకు- అప్రతిష్ఠపాలు గాకు, ధైర్యంగా పరిస్థితిని ఎదుర్కో.

**ప్ర** 'నేనొకపని చేయబోతున్నాను. లాభమొస్తుందో! రాదో! నని' 'విజయం లభిస్తుందో ! అపజయం కలుగుతుందో! నని', దానివల్ల సుఖం కలుగుతుందో ! దుఃఖమే సంభవిస్తుందో నని, మనస్సులో ఒకే ఆందోళన. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాను. తప్పడుమార్గాలను అనుసరింపక తప్పదా? నా ఆలోచన ఎలా ఉండాలి? నే నెలా నడుచుకోవాలి? ఏది శాంతిప్రదమైన మార్గం?

**జ)** సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి 2-38

నీ ఆందోళనవల్ల విజయం లభింపదు. ఆందోళనతో నీవు కర్తవ్యాన్ని సరిగా నిర్వహింపలేకపోవచ్చు. నీ వనుభవించవలసిన ఫలితం నీకోసం కాచుకొనే ఉంది. అది ఎలాగూ నిన్ను వరిస్తుంది. దానికోసం నీవు తప్పుడుమార్గాలను అనుసరించనక్కరలేదు. సుఖ-దుఃఖాలను, లాభనష్టాలను సమానంగానే భావించు. ఏది వచ్చినా సంతోషంగా భగవత్ప్రసాదమనే భావనతో అనుభవించడానికి సిద్ధంగా ఉండు. దీనివల్ల నీలో రాగ-ద్వేషాది దోషాలు పెరిగి పాపాలుచేసే ప్రమాదంనుంచి తప్పుకుంటావు. కర్తవ్యం మఱి నీవంతు.

**ప్ర** నేను చాలా ఇబ్బందిపడుతున్నాను. ఏ పని చేద్దామన్నా ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగా వ్యతిరేకంగా ఉన్నాయి పరిస్థితులు. బాధ్యత వదలి బెదిరి పారిపోవడమా? లేక ఫలితం ఏమైనాసరే ధైర్యంతో కర్తవ్యనిర్వహణం చేయడమా? అన్నది సమస్య. జీవన్మరణసమస్య. మరి దీన్నెలా పరిష్కరించడం?

**జ)** హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్।
తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 2-37

నీ మనస్సును దిటవు చేసుకో. బాధ్యతను వదలి పారిపోయినంతమాత్రాన సమస్య పరిష్కారం ఎలా జరుగుతుంది? నీ సుఖప్రారబ్ధం సుఖాన్ని, దుఃఖప్రారబ్ధం దుఃఖాన్ని నీ సలహా సంప్రదింపులు లేకుండా ఇవ్వడానికి కాచుకొని ఉన్నాయి. కనుక నీ కర్తవ్యాన్ని నీవు ధైర్యంతో నిర్వహించు. దైవానుకూలత ఉంటే కృతార్థుడవౌతావు. సక్రమంగా కర్తవ్యాన్ని చేసినవాడవౌతావు. కాలమే పరిస్థితుల్ని చక్కబరుస్తుంది. అలా కాకపోయినా సక్రమంగా కర్తవ్యాన్ని చేసినవాడవౌతావు. కాలమే పరిస్థితుల్ని చక్కబరుస్తుంది.



## మరీచిమహర్షి జయన్తి (18-07-2026)

శ్రీ విఖనసాచార్యులవారి శిష్యులలో రెండవవారైన మరీచిమహర్షి ఆషాఢమాసమున శుక్లపక్షము పూర్వఫల్గునీ నక్షత్రమున జన్మించారని వైఖానసాగమం తెలుపుతున్నది. తిరుమల శ్రీవారి ఆరాధనాదులన్నియు మరీచిమహర్షి అనుగ్రహించిన విధానమునే ప్రమాణముగ ఎంచి జరుపుతున్నారు. వీరికి ఈ దినమున జయన్తిని జరుపుతారు.



ఎన్ని కష్టాలొచ్చినా ధర్మమార్గంలోనే పయనించాలి. తప్పడుమార్గాల్లో వెళ్లకు

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000




**గతసంచిక తరువాయి..**

వకుళమ్మ హరి తీవ్రతాపాన్ని గుర్తించింది. ఆపై ఆ అమ్మాయి పేరేమిటి? ఆ వయ్యారి స్వస్థలం ఏది? తప్పక నేను ఆవిడతో నీకు పెళ్లి చేయిస్తానంది. వెనువెంటనే హరి "అమ్మా ఆ అమ్మాయి చంద్రవంశజ. ఆకాశరాజు తనకు సంతానం లేకపోతే పుత్రకామేష్టి మొదలెట్టిన యాగస్థలం దున్నుతూ ఉంటే ఒక పద్మం పుట్టింది. ఆ పద్మంలో ఒక అందమైన పసిపాప కనిపించడంతో రాజు అమ్మాయిని పెంచి పెద్దచేసే బాధ్యత చేపట్టాడు. ఆ అమ్మాయి పేరు 'పద్మావతి'. నాకూ, పద్మావతికి ఆ బ్రహ్మ పెళ్లి నిశ్చయించి ఉంటే నేను బ్రతుకుతాను. లేకపోతే వైకుంఠమే నాకు గతి."

"జన్మజన్మాంతర పుణ్యపరిపాకం కలవారికే, ఆ చిన్నారి దక్కుతుంది. ఆ పరిపాకంవల్లనే నేను ఆవిడను చూడగలిగాను. ఆమెతో మాటలాడగలిగాను. అయినా ఆ సుందరిని వదలి రావలసి వచ్చింది. ఆవిడను చూశాక నాకు అన్నపానీయాలపై ఆశ చచ్చింది. ఆ కన్యక నాకు దక్కితే జీవిస్తాను, కాకుంటే నేను బతకలేనమ్మా."

"అమ్మా! ఆ పద్మావతి ఎందుకోగానీ చెలికత్తెల్ని రెచ్చగొట్టి నాపై రాళ్ళవర్షం కురిపించింది. ఆ దెబ్బలకు నిలువలేక గుఱ్ఱం నేలబడింది. నేను భయంతో వెంటనే ఈ పర్వతం చేరుకున్నాను. ఇలాంటి సౌందర్యవతిని నా కళ్లబడజేసి బ్రహ్మ నాకింత కష్టం తెచ్చిపెట్టాడు. ఇందుకు నేను గతంలో చేసిన పాపంకూడా కారణమేమో! ఆమెతో అనుసంధానం పెరగాలని బ్రహ్మ ఇలాంటి సంఘటనలు కల్పించాడేమో! అమ్మా! నీవు నాకు సాయం చేసి ఆ కన్యక నాకు దక్కేలా చేస్తే నీవే పరమభాగవతోత్తమురాలనీ నిశ్చయిస్తాను. అమ్మా! అనేక గో, భూ హిరణ్యాది సకలదానాలు చేసినవారికి ఎంతటి పుణ్యమో! అంత పుణ్యం కన్యాదానంవలన మాంగల్యధారణం కావడానికి సహకారమిచ్చినవారికీ అంతే పుణ్యం. నీవు ఈ పుణ్యం కట్టుకోవమ్మా!" అన్నాడు.

హరి చెప్పిందంతా శాంతంగా విన్న వకుళ "కుమారా! నీవు చెప్పిందంతా వింతగానే ఉంది. భూలోకంలో నేలమీద పద్మం పుట్టడమేమిటి? ఆ పద్మంలో సుందరాంగి కనిపించడమేమిటి? ఇలాంటివి నేను వినలేదే! ఆ వింతల్ని నాకు చెప్పరా!" అని అంటే హరి వకుళమ్మకు రామకథ చెప్పాడు.

అమ్మా! త్రేతాయుగంలో నేను దశరథమహారాజుకు కొడుకై పుట్టాను. విశ్వామిత్రమహర్షి యాగసంరక్షణ చేశాను. శివధనుర్భంగం చేసి, సీతమ్మను పెళ్లాడాను. తండ్రి ఆనతిమేరకు నేను సీతాలక్ష్మణులతో కాననావాసం చేశాను. అరణ్యంలో సీత ఒక మాయామృగాన్ని చూచి అపేక్షపడితే నేను మాయామృగంకేసి సుదూరం వెళ్లిపోయాను. ఆ సందర్భంలోనే రావణాసురుడు సీతను అపహరించాడు. రావణుడు తన రథంపై సీతను ఎక్కించుకొని ఆకాశమార్గాన వెళుతుంటే సీత 'శ్రీరామా' అని ఎలుగెత్తి అరిచింది.

ఆ సమయంలో అగ్నిదేవుడు రావణునితో 'దశగ్రీవా! నీవు అపహరించిన ఆమె సీత కాదు" అన్నాడు. 'శ్రీరాముడు సీతమ్మను నా చెంత చేర్చి విప్రాంగన లాంటి సీతమ్మను ఆశ్రమంలో ఉంచాడు." అని విశదం చేసి వేదవతిని సీతమ్మగా భావించేలా చేసి రావణునికిచ్చాడు. ఆ మూర్ఖుడు అసలు సీతమ్మను అక్కడే వదలి, వేదవతిని సీతగా భావించి అశోకవనిలో బంధించాడు. ఆ వేదవతి రామా! రామా! అంటూ అశోకవనంలో ప్రలాపించింది.

ఆ అగ్నిదేవుని సతిచెంత సీత సురక్షితురాలై కాలం గడిపింది. నేను సముద్రాన్ని బంధించి రావణ కుంభకర్ణాది రాక్షసుల్ని సంహరించాను. అందరు మెచ్చుకోవాలని సీతతో అగ్నిప్రవేశం చేశాకగాని ఏలుకోనని చెప్పాను. వేదవతి అగ్నిలో ప్రవేశించింది. అంతేకాదు ఇద్దరు సీతమ్మలకు ఇదే పరీక్ష అయింది. *(ఇంకా ఉంది)*



# అమరం! కర్ణకథ అజరామరం!!

- శ్రీ ఐనవోలు మోహనాచార్యులు

భారతీయ ఇతిహాసాల్లో మహాభారతం ఒక సజీవమైన మానవ అధ్యయనంగా నిలుస్తుంది. ఇందులోని ప్రతి పాత్ర ఒక విలక్షణమైన తాత్వికభావనకు ప్రతీక. ఆ పాత్రలలో కర్ణుడు ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నాడు. అతని జీవితం సాధారణ గెలుపు, ఓటముల కథ కాదు; అది సామాజిక అసమానత, కర్మసిద్ధాంతం, విధినిర్ణయం అనే అంశాలమధ్య జరిగే సంఘర్షణ. ముఖ్యంగా అతని పుట్టుక మరియు శాపాలు– ఈ రెండు అంశాలు అతని జీవితాన్ని మాత్రమే కాదు, అతని వ్యక్తిత్వాన్నికూడా నిర్వచించిన మూలాధారాలు.

దుర్వాసమహర్షి కుంతిభోజుని కుమార్తె కుంతికి ఇచ్చిన వరప్రభావంతో సూర్యునిఅంశాన సహజ కవచకుండలాలతో జన్మించిన కర్ణుడు సూర్యతేజస్సుతో ప్రకాశించాడు. కర్ణుడిని పూర్వజన్మలో సహస్రకవచుడు అనేవారు. అతనికి వేయికవచాలు ఉండేవి. అతనికి ఉన్న 999 కవచాలు నరనారాయణులు ఛేదించి సంహరించారు. అతడే తర్వాతజన్మలో సహజ కవచకుండలాలతో కర్ణుడిగా కుంతిగర్భాన జన్మించాడు. కన్య అయిన తనకు సంతానం చేటు తెస్తుందని కుంతి ఇతనిని ఒక పెట్టెలో పెట్టి గంగలో పడవేసి ఇంటికి వెళ్ళిపోయింది. అది సూతవంశజుడు అతిరథుడు తన భార్య రాధకు ఆ పెట్టె దొరికింది. అందులో ఉన్న బాలకుని జూచి సంతానం లేని తమకు దేవుడు ప్రసాదించిన బిడ్డగా భావించి అతన్ని పెంచారు.

కర్ణుడికి యుద్ధవిద్యపై అమితమైన మక్కువ. ద్రోణాచార్యుడివద్దకు వెళ్తే, "రాజకుమారులకు తప్ప ఇతరులకు విద్య నేర్పను" అని తిరస్కరింపబడ్డాడు. విధి లేక బ్రాహ్మణుడివేషంలో పరశురాముడిని ఆశ్రయించాడు. అక్కడ విద్యను నేర్చుకుంటున్న తరుణంలో ఒకరోజు గురువు కర్ణుడి తొడపై తలపెట్టి నిద్రిస్తుండగా, ఒక భయంకరమైన కీటకం అతనితొడలోని మాంసాన్ని తొలుస్తోంది.

గురువు నిద్ర చెడకూడదని ఆ భయంకరమైన నొప్పిని భరించిన కర్ణుడిని చూసి పరశురాముడు మేల్కొన్నాడు. "ఓర్పు క్షత్రియుడి లక్షణం, నీవు అబద్ధం చెప్పావు" అని ఆగ్రహించాడు." నీవు కపటంతో నేర్చుకున్న ఈ అస్త్రవిద్య, నీకు అవసరమైన సమయంలో నీకు గుర్తుకు రాదు" అని శపించాడు. కర్ణుడు చేసిన తప్పు తన ప్రతిభను నిరూపించుకోవాలనుకోవడమే, కానీ అది శాపమై అతడిని వెన్నాడింది. జ్ఞానం ఉన్నప్పటికీ, అది అవసరమైన సమయంలో ఉపయోగపడకపోతే, ఆ జ్ఞానం వ్యర్థం. కర్ణుడివిషయంలో, అతని ప్రతిభను చివరిక్షణంలోనే నిర్వీర్యం చేసే శక్తిగా ఈ శాపం పనిచేసింది. ఇది విధి అనే భావనను బలంగా ప్రతిబింబిస్తుంది– మనిషి శ్రమ ఎంత ఉన్నా, కొన్ని పరిస్థితులు అతని నియంత్రణలో ఉండవు.

కర్ణుడు అనుకోకుండా ఒక ఆవును సంహరించాడు. ఇది ఉద్దేశపూర్వకమైన తప్పు కాదు; అయినప్పటికీ, అతను శాపానికి గురయ్యాడు. "యుద్ధంలో నీ రథచక్రం నేలలో ఇరుక్కుపోతుంది" అనే శాపం, తర్వాత కురుక్షేత్రయుద్ధంలో నిజమైంది.

ఒకరోజు కర్ణుడు తన రథంపై వెళ్తుండగా, దారిలో ఒక చిన్నారి ఏడుస్తూ కనిపించింది. ఆమెచేతిలో ఉన్న పాత్రలోని నెయ్యి క్రింద పడిపోవడంతో, మళ్ళీ ఆ నెయ్యి కావాలని ఆమె బాధపడుతుంటుంది. దయాహృదయుడైన కర్ణుడు కొత్త

నెయ్యి ఇస్తానని చెప్పినా ఆ బాలిక ఒప్పుకోదు. క్రిందపడిన నెయ్యే కావాలని పట్టుబట్టింది. కర్ణుడు ఆ నేలను తన చేతులతో గట్టిగా పిండి, ఆ మట్టిలో కలిసిపోయిన నెయ్యిని తీసి బాలిక పాత్రలో వేశాడు.ఆ సమయంలో కర్ణుడు భూమిని అంత గట్టిగా పిండడంతో బాధపడిన భూదేవి ప్రత్యక్షమై.. "కర్ణా! ఒక చిన్నారి కోసం నన్ను ఇంతలా పీడించావు. కాబట్టి, నీ జీవితంలో అత్యంత కీలకమైనసమయంలో (యుద్ధభూమిలో), నీ రథం చక్రం ఇలాగే మట్టిలో కూరుకుపోయేలా చేస్తాను" అని శపించింది.

**విధి** – జననంనుండే నిర్ణయించబడిన పరిస్థితులు

**కర్మ** – అతనిచర్యల ఫలితాలు

**సమాజం** – అతని అవకాశాలను పరిమితం చేసిన వ్యవస్థ

ఈ మూడుశక్తులమధ్య కర్ణుడు ఒక సమతుల్యతను సాధించలేకపోయాడు; కానీ అతను తన గౌరవాన్ని మాత్రం కోల్పోలేదు. అతని శాపాలు అతన్ని ఓడించాయి; కానీ అతని మహత్తును తగ్గించలేకపోయాయి.




కురుక్షేత్రయుద్ధం అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతున్న క్షణంలో, కర్ణుడి రథచక్రం భూమిలో ఇరుక్కుంది. ఆ క్షణంలో కర్ణుడు యుద్ధాన్ని ఆపమని విజ్ఞప్తి చేశాడు. "ఇది ధర్మయుద్ధం కాబట్టి, నాకు సమయం ఇవ్వాలి" అని అన్నాడు. అతనిమాటల్లో ఒక యోధుని ఆత్మగౌరవం కనిపించింది.

అప్పుడు కృష్ణుడు గంభీరంగా స్పందించాడు. "కర్ణా! ఇప్పుడు ధర్మంగురించి మాట్లాడుతున్నావా? ద్రౌపదిని అవమానించినప్పుడు, అభిమన్యుని అన్యాయంగా చంపినప్పుడు నీకు ఈ ధర్మం గుర్తుకు రాలేదా?" అని ప్రశ్నించాడు. ఈ మాటలు కర్ణుడిని లోలోపల కలచివేశాయి. అతను తన తప్పులను అంగీకరించినప్పటికీ, తన పరిస్థితివల్ల ఆ మార్గంలో నడిచానని మౌనంగా భావించాడు.

కర్ణుడి వ్యక్తిత్వంలో అత్యంత విశేషమైన లక్షణం అతని నిబద్ధత. దుర్యోధనుడు అతనికి గౌరవం ఇచ్చిన మొదటి వ్యక్తి. ఆ క్షణంనుండే కర్ణుడు తన జీవితాన్ని అతనికి అంకితం చేశాడు. అయితే ఇక్కడే అతని జీవితంలోని ప్రధాన నైతిక సంకటము కనిపిస్తుంది. ధర్మం ఏదో అతనికి తెలుసు, కానీ కృతజ్ఞత అతన్ని అధర్మం వైపు నడిపించింది. ఈ సంఘర్షణ అతన్ని ఒక గొప్ప వ్యక్తిగా, ఒక విషాద నాయకుడిగా కూడా నిలబెట్టింది.

కర్ణుడి గుణాలలో అత్యున్నతమైనది అతని దానశీలత. అతను ఎవరైనా ఏదైనా అడిగితే నిరాకరించేవాడు కాదు. అతని దానం ఒక వ్యక్తి గతగుణం మాత్రమే కాదు; అది ఒక తాత్విక ప్రకటన–"స్వార్థం కంటే పరమార్థం గొప్పది" అనే భావన. అయితే ఈ గుణమే అతని బలహీనతగా మారి అతని స్వీయ పతనానికి దారితీసింది..

"ప్రతిభ ఉన్నా సరే, ధర్మంపక్షాన నిలబడకపోతే విధి మరియు శాపాలు మనిషిని వెన్నాడుతూనే ఉంటాయి." అని కర్ణుడిజీవితం మనకు ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. అయినప్పటికీ, స్నేహానికి ప్రాణమిచ్చిన వీరుడిగా, అడిగినవారికి లేదనని దాతగా కర్ణుడు ఇతిహాసంలో నిలిచిపోయాడు.

*2026, జూలై 26న*
*“నారాయణగిరిలో ఛత్రస్థాపనము” సందర్భంగా..*

# అనంతరూప భగవత్కార్య సాధకుడు వాయుదేవుడు

- శ్రీ రాచూరి వెంకటరమణ,
98853 21967

తిరుమలలోని నారాయణగిరి శ్రీవారిపాదాలవద్ద ప్రతిఏటా ఛత్రస్థాపనోత్సవం వేడుకగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా శ్రీవారిపాదాలవద్ద తి.తి.దే. అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తోంది.

తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తైన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్టు పురాణాలమాట. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవానికి మరోమాటేమంటే... సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తుంటాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువఎత్తులో ఉండడంతో మరింత గాలులు వీస్తాయి. ఈ గాలులనుంచి ఉపశమనం కల్గించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్ఠిస్తారు.

## నారాయణగిరి ఛత్రస్థాపనోత్సవం

శ్రీవేంకటేశ్వరస్వామివారి శ్రీపాదముద్రలతో ప్రకాశించే శిలాఫలకంతో ప్రఖ్యాతిగాంచిన నారాయణగిరిలో ప్రతి సంవత్సరం శ్రీపాదపూజా ఛత్రస్థాపనఉత్సవం జరుగుతుంది.

శ్రీస్వామివారికి ప్రాతఃకాలారాధనం, మధ్యాహ్నికారాధనం పూర్తైనతర్వాత అర్చక స్వాములు. ఏకాంగులు, అధికారులు, పరిచారకులు మొదలైన కైంకర్యపరులు రెండు భూచక్రగొడుగులను, యమునోత్తరనుండి రెండు పుష్పసరములను, సువర్ణకూప తీర్థమును తీసుకొని మంగళవాద్యాలతో సహస్రప్రదక్షిణంగా బయలుదేరి నారాయణగిరికి వెళ్తారు. అక్కడ శిలాఫలకంపై ఉన్న శ్రీవారిపాదాలను సువర్ణకూపతీర్థంతో అభిషేకంచేసి, టెంకాయలు కొట్టి ఆరగింపుచేస్తారు. ఆ తర్వాత టెంకాయలు స్థానబహుమానపూర్వకంగా గోష్ఠికి వినియోగం జరుగుతుంది. ఆ తర్వాత శ్రీవారి పాదాలవద్ద ఉన్న చెట్లకు భూచక్ర గొడుగులు కడతారు. ఆ తర్వాత నారాయణగిరి దిగి బంగళా తోటకు వచ్చి అక్కడ శ్రీవారిప్రసాదం స్థానబహుమాన పూర్వకంగా వినియోగం చేయబడి వనభోజనం జరుగుతుంది. ఆ తర్వాత మంగళవాద్యాలతో అందరూ భగవన్నామ సంకీర్తనంతో మహాద్వారమునకు వచ్చి శ్రీవారి కైంకర్యాలు నిర్వర్తిస్తారు. ఈ సందర్భంగానే ఈ “వాయుదేవుడు” వ్యాసం సంక్షిప్తంగా కొంత తెలుసుకుని స్మరించుకుందాం.

ముఖ్యప్రాణులు త్యక్తవైదికులు, వీరి జ్ఞానమనాది. అనంతమైనది. అయిననూ తత్వములను వేదానుసారంగా చింతించే శ్రేష్ఠవైదికులు. తొణకని బెణకని తెలివి వీరిది. వాయుదేవులు లక్షణశాస్త్రానుసారముగా ముప్పైరెండు (32)



లక్షణములుగల పరమసుందరుడు, దేవతాశ్రేష్ఠుడు. వేగవంతుడు. శౌర్యవంతుడు. అతి బలవంతుడు. జ్ఞానవంతుడు. భగవత్కార్యసాధకుడు. శ్రీహరిసన్నిధిలోనే జీవోత్తముడుగా, దేవతాశ్రేష్ఠునిగా సకలదేవతలచే పూజింపబడుతున్నా అహమించక ఎల్లవేళలా వినయాన్ని ప్రదర్శిస్తుంటాడు వాయు దేవుడు. ఇలా తెలివికి, బలిమికి నిలయమైన అనిలదేవుడు ధర్మ సంరక్షణలో ధరిత్రీభారమును హరించే శ్రీహరికార్యములో ప్రధాన కార్యసాధకునిగా తన బలజ్ఞానద్వయములతో విశేష శ్రీహరిసేవనొనర్చినాడు. ముఖ్యప్రాణుడు తన మూల, అవతార రూపములలో శ్రీహరిసేవను విశేషముగా చేశాడు. శ్రీహరి ఆజ్ఞచే దేవతలెల్లరు నాలుగుయుగములందూ వారి వారి యోగ్యమగు అవతారములు స్వీకరించగా పరమాత్ముని కార్యసాధనకు భగవదాజ్ఞతో బలరూపియై, జ్ఞానియై శ్వాసతో జగత్తును ధరించాడు వాయుదేవుడు.

## సర్వోత్తముడు; వాయుదేవుడు జీవోత్తముడు, దేవతాశ్రేష్ఠుడు.

వాయుదేవుడు అన్ని అవతారములందునూ ఈ తత్త్వమును సదా ఆనుసరించినాడు. వాయుదేవుడు సకల దేవతాశ్రేష్ఠుడు. తైత్తిరీయఉపనిషత్‌నందు ఇంద్రియాభిమాన దేవతలు "నేను గొప్ప నేను గొప్ప" అని ప్రజాపతివద్దకు పోగా ఆతడు "ఈ శరీరమును ఏ అభిమాన దేవత వీడిపోయిన మృతమగునట్లు కనుపించునో వారే శ్రేష్ఠులు" అని తెలుపగా ఆ ఇంద్రియాభిమాన దేవతలెల్లరూ పోటీపడగా ఆ దేవతా పోటీలో ప్రతీ ఇంద్రియాభిమాన దేవత నిష్క్రమించిన పిదప ఆ ఒక్క ఇంద్రియము మాత్రమే క్రియాహీనమయ్యింది. పతనమయ్యింది. వాయుదేవులు చివరగా నిష్క్రమించారు. అట్లే చివరనే ప్రవేశించారు. వాయుదేవులవారు నిష్క్రమించగానే ఏ విధముగా తేనెటీగ రాజువెంట తేనెటీగలు వెళ్తాయో తత్త్వాభిమానులంతా వాయుదేవుని అమోఘ దివ్యశక్తిచేత వెంట లాక్కోబడి బయల్వెడలారు. ఆ శరీరము పతనమయ్యింది. మరల వాయుదేవులవారు ప్రవేశించగానే చైతన్య క్రియాశీలమయ్యింది. దేవతలందరూ వాయుదేవుని దేవతాశ్రేష్ఠులుగా, స్వామిగా అంగీకరించి ప్రణమిల్లి ఆశ్రయించారు. బళిత్థా సూక్తములో వాయుదేవుడు పరాభవమెరుగని అనుపమాన



బలసంపన్నుడని, శ్రీహరిని తెలుసుకున్న జీవోత్తముడని, సర్వజ్ఞాన సంపన్నుడని పేర్కొనబడినది. కలి, దేవదానవులు ఏకమైననూ వీరి శక్తిముందు దిగదుడుపే.

## క్షీరసాగరమథనఘట్టము: హాలాహల జీర్ణము

కాలకూటవిషమును సునాయాసముగా త్రాగి జీర్ణించుకొన్నవారు ఘనోదకములో సమస్తవిశ్వమునూ సర్పంలా ధరించిన ఆదిశేషునికి వాయుకూర్మరూపముతో ఆధారమైనవాడు ముఖ్యప్రాణుడు. ఇలా నిరంతరమూ పరాభవం లేని పరాశక్తి అయిన వాయుదేవునికి విష్ణుకూర్మరూపముతో ఆధారమైనవాడు శ్రీహరి. వినమ్రతతో శ్రీహరి కార్యసాధనే వాయుదేవుని లక్ష్యం. ఇది వాయుదేవునియొక్క వినమ్రత, నిరాడంబరత మరియు విష్ణువుయొక్క కార్యసాధన లక్ష్యంపట్ల నిబద్ధతను వక్కాణించుచున్నది.

క్షీరసాగరమథనఘట్టమున బ్రహ్మవరముతో బలిష్ఠమైన, అనితరులకు స్పృశించు సామర్థ్యము లేని కలిస్వరూపమైన

హాలాహలమును ఏకధాటిగా అనాయాసముగా భుజించి జీర్ణము చేసుకున్నవాడు ముఖ్యప్రాణుడు. వాయుదేవుడు శ్రీహరికి సముద్రమథనమున తన అనుపమానమైన ప్రాణ శక్తితో తోడ్పడుతూ, వెలువడుచున్న లోకకంటకమైన హాలా హలమును తన అసమాన ప్రాణశక్తిచే ఏకధాటిగా జీర్ణించు కొని, మర్దించి, విషప్రభావమును క్షీణింపజేశాడు. రుద్రదేవుడు ఆ హాలాహలమును త్రాగి తన గరళమునునుంచి లోకాలను ఉద్ధరించి నీలకంఠుడని కీర్తిపొందాడు.

## విష్ణుప్రీతికై ముఖ్యప్రాణులు జీవులకొరకు ప్రతిదినము 21,600 శ్వాసరూప హంసమంత్రజపం:

మన జీవితంలో, అత్యంత ముఖ్యమైన "శ్వాసించే" కార్యము వాయుదేవుడు నిర్వహిస్తాడు. శ్వాస లేకుండా జీవితం లేదు. ఊపిరి పీల్చుకుంటూ అతను హంసమంత్రం (అజపా–జప) అనే చాలా ముఖ్యమైన జపాన్ని చేస్తుంటాడు. హంస మంత్రంలో "హమ్" అనేది మన ఉచ్ఛ్వాసాలపై శ్వాసయొక్క శబ్దం మరియు "స" అనేది నిశ్వాస శబ్దం. మనం కళ్ళు మూసుకుని ఏకాగ్రతతో గమనిస్తే మన శ్వాసయొక్క "హమ్మింగ్" శబ్దాన్ని పీల్చేటప్పుడు " హామ్" మరియు ఉచ్ఛ్వాస సమయంలో "స" అని నిట్టూర్పు వినవచ్చు (హామ్ – సాహా). పీల్చడం మరియు వదులుకోవడం (రేచక మరియు పూరక) ప్రతిశ్వాసయొక్క రెండుముఖాలు. వాయుదేవుడు మనకు తెలియకుండానే ఈ జపం చేస్తాడు.

### 2026, ఆగస్టు నెల ఉత్సవాలు, పర్వదినాలు

- **07** ఆడికృత్తిక
- **15** భారత స్వాతంత్ర్యదినోత్సవం
- **16** నాగచతుర్థి
- **17** గరుడపంచమి
- **21** మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి, వరలక్ష్మీవ్రతం
- **28** శ్రీహయగ్రీవజయంతి, శ్రావణపూర్ణిమ

సగటున ఒక మానవుడు ఒకరోజులో ఇరవైఒక్కవేల ఆరువందలసార్లు శ్వాస (21,600) తీసుకుంటాడు మరియు ఈ ప్రక్రియద్వారా అతను తెలియకుండా– తెలిసి (అజపా–జప) హంసమంత్రాన్ని ప్రతి జీవికొరకు రోజుకి 21,600సార్లు హంసరూపియైన భగవాన్ శ్రీలక్ష్మీనారాయణుని ప్రీతికోసం సమర్పిస్తాడు. సాధారణంగా, చాలామంది మానవులకు ఇది తెలియదు. అందుకే దీనిని అజప్ప అని పిలుస్తారు. అయితే, ఎవరైనా ఈ భావనను తెలుసుకొని, అంగీకరించి, మనలో హంసమంత్రాన్ని ప్రదర్శించినందుకు వాయుదేవునికి కృతజ్ఞతలు తెలిపితే, దానిని జపం అంటారు. వాయుదేవుడిని స్మరించడం వల్ల పుణ్యం లభిస్తుంది.

## వాయుదేవుడు భావిబ్రహ్మగా వెలసి సాయుజ్యముక్తి పొందుతాడు

వాయువు రాబోవు కల్పమున చతుర్ముఖబ్రహ్మ పదవికి పోతాడు. కావున వాయువే బ్రహ్మ అని చెప్పబడుతోంది.

ప్రధాన వాయువు ముఖ్యప్రాణుడు. ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన అని పంచప్రాణములకు అధిపతి. ముఖ్యప్రాణమూర్తి కేవలము భగవదాధీనమైన ప్రవృత్తి కలవాడు. పంచేంద్రియములలో చేరడు. పంచభూతములలో మరియు ఇంద్రసభలో గోచరించు వాయువు "వాయుదేవుని/ ముఖ్యప్రాణుని" సుతుడు "ప్రవాహవాయువు".

"నేను, వాయువూ స్వాభావికశక్తితోనే జయశీలురము" అని శ్రీహరి వాక్యము. శ్రీహరి చేసే సకలకర్మములనూ అతని ఆదేశమునుసరించి ఏదోవిధంగా సాధిస్తాడు వాయుదేవుడు. ఈ విధంగా అనంతమైన సుకృతమును సంపాదించుకున్నాడు. ఇదే సహా భోగము. భగవంతునికి పరమ ప్రీతికరమయినవాడు గావున భగవంతునికృపచే భగవంతునితో సహభోగము గలదు. అనగా భగవంతునికి గల భోగములు ముఖ్యప్రాణునికి ఉన్నాయి. ఇలా సకలపదార్థములలో ముఖ్యప్రాణునికి యోగ్యమైన రసమును అందించి స్వయోగ్యమైన రసమును భగవంతుడు తాను మాత్రమే స్వీకరించుచున్నాడు. వాయుదేవుడు ఈ కల్పానంతరము లయనొందక శ్రీలక్ష్మీదేవిని చేరి రాబోవు కల్పమున చతుర్ముఖబ్రహ్మగా వెలసి తన విశేష శ్రీహరిసేవను కొనసాగించి అత్యంత ఉన్నతమైన సాయుజ్యముక్తులై సహ భోగమును అనుభవిస్తారు.

గృహలక్ష్మి

# దక్షిణాయన పుణ్యకాలం

- శ్రీమతి వి.శ్రీలక్ష్మి

**2026, జూలై 17 న**
**దక్షిణాయన ప్రారంభం సందర్భంగా..**

భారతదేశంలో ప్రాచీనకాలంనుంచి సూర్యగమనం ఆధారంగా కాలగణనం అద్భుతంగా చేశారు. ప్రతి సంవత్స రాన్ని రెండు ఆయనాలుగా విభజించారు. ఒకటి ఉత్తరాయణం, రెండవది దక్షిణాయనం. ఖగోళశాస్త్రంప్రకారం.. సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్థం వస్తుంది.

పన్నెండురాశుల్లో సూర్యునిప్రవేశాన్నిబట్టి ప్రతినెలా సంక్రాంతి వస్తుంది. ఆ పరంపరలో మకరరాశిలో సూర్యుని ప్రవేశం 'మకరసంక్రాంతి'గా నాటినుంచి ఉత్తరాయణపుణ్య కాలంగా ఆచరిస్తారు. అదేవిధంగా కర్కాటకరాశిలో సూర్యుని ప్రవేశాన్ని దక్షిణాయనపుణ్యకాలం ప్రారంభంగా లెక్కిస్తారు. దీనినే కర్కాటకసంక్రాంతి అనికూడా అంటారు. కర్కాటక



రాశిలో సూర్యుడిప్రవేశం నాటినుంచి మకరరాశిలో సూర్యుడి ప్రవేశంవరకు మధ్యకాలాన్ని దక్షిణాయనం అంటారు.

భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరా యణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయనమని అంటారు. అంటే ఏడాదిలో ఆరునెలలు ఉత్తరాయణం, ఆరు నెలలు దక్షిణాయనం. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని చెప్పుకున్నా.. సరిగ్గా గమనిస్తే అది తూర్పుదిక్కున జరగదు.. కేవలం ఏడాదిలో రెండురోజులుమాత్రమే సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు... అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగిలిన ఆరునెలలు ఈశాన్యానికి దగ్గరగా, మరో ఆరునెలలు ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది.

సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించేకాలాన్ని 'ఉత్తరాయణం' అని , ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించేకాలాన్ని 'దక్షిణాయనం' అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్యరేఖకు దక్షిణదిశలో పయనిస్తాడు. ఆధ్యాత్మికపరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవత లకు రాత్రికాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. అందుకే ఇలాంటిసమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం, అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడానికి ప్రత్యేక ఉపవాసాలు, పూజలు చేస్తారు. అందుకే ఇది ఉపాసనకాలం అయింది. ఈ సమయంలోనే యోగులు, మఠాధిపతులు చాతుర్మాసదీక్ష చేపడతారు. ఆషాఢ శుద్ధఏకాదశిరోజున యోగనిద్రలోకి వెళ్లి కార్తికశుద్ధఏకాదశి నాడు నిద్రలేస్తాడు.

శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది, ఫలితంగా జీవులలో రోగనిరోధక శక్తి క్షీణించి రోగాలబారిన పడతారు. వీటిని నిరోధించడానికి

ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపాసన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాలపేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని ప్రసాదించడంతోపాటు పరమాత్మ పాదదర్శన భాగ్యాన్ని కలిగిస్తాయి.

హిందూమతంలో దక్షిణాయన ప్రారంభం దేవతలకు రాత్రిసమయప్రారంభంగా విశ్వసిస్తారు. మానవుడి సంవత్సర కాలం దేవతలకు ఒకరోజు. దేవతలకు దక్షిణాయనం రాత్రి పూటగా, ఉత్తరాయణం పగటిపూటగా పరిగణిస్తారు. పురాణాలలో దక్షిణాయనం ప్రారంభమైనరోజునుంచి విష్ణుమూర్తి నిద్రకు ఉపక్రమిస్తాడని విశ్వాసం. దీనినే 'దేవశయనఏకాదశి' అనికూడా అంటారు. ఈ సమయంలోనే చాతుర్మాస్యవ్రతాన్ని ఆచరించడం జరుగుతుంది.

కర్కాటకసంక్రాంతిరోజున పితృదేవతలకు శ్రాద్ధం నిర్వహించడం లేదా పిండప్రదానం చేయడం పురాణకాలం నుంచి వస్తున్న ఆచారం. మరికొన్ని పురాణాలలో వరాహమూర్తి విష్ణుమూర్తిని పూజించినరోజుగా ప్రసిద్ధికెక్కింది. తమిళనాడులో దక్షిణాయనం ప్రారంభంనాటినుంచే ఆడి(ఆషాఢమాసం) ప్రారంభమవుతుంది. ఈ రోజునుంచి ఎటువంటి పండగలు, శుభకార్యాలు చేసుకోరు. అదేవిధంగా దేవతలకు రాత్రిపూటగా భావించే దక్షిణాయనంలో కొన్ని ముఖ్యమైన పండుగలుకూడా వస్తాయి. వాటిలో ప్రప్రథమంగా 'వరలక్ష్మీవ్రతం' శ్రావణ మాసంలో వస్తుంది. లక్ష్మీదేవికి ప్రీతికరమైన ఈ వ్రతాన్ని భారతదేశమంతా ఆచరించడం అందరికి తెలిసిన విషయమే. ఋషులు, సన్యాసులు, పీఠాధిపతులు ఈ కాలంలో చాతుర్మాస్య దీక్షను చేపడుతారు.

## దక్షిణాయనం ప్రాముఖ్యత

కర్కాటకరాశినుంచి ధనుస్సురాశివరకు సూర్యుని గమనాన్ని దక్షిణాయనంగా పరిగణిస్తారు అనగా ఈ సమయం నుంచి కాలంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటాయి. దానితో మానవునిజీవితంకూడా ప్రభావితమవుతుంది. దీనికి ఉదాహరణ కర్కాటకరాశిలో సూర్యుడి ప్రవేశం అనగా ఈ సమయం వర్షాకాలం. ఈ సమయంలో పంటలు, వ్యవసాయ పనులు ప్రారంభమై ఊపందుకొంటాయి. అదేవిధంగా మిగిలిన మూడునెలలు చలికాలం వస్తుంది. ఆధ్యాత్మికంగా ఇది చాలా విలువైనకాలం. శ్రావణనుంచి కార్తికమాసంవరకు చాతుర్మాస దీక్ష చేసే కాలం. ఈ నాలుగునెలలు శ్రీమహావిష్ణువుకు చాలా ప్రీతికరమైనదిగా విశ్వసిస్తారు. విష్ణుమూర్తి యోగనిద్రలోకి వెళ్లే సమయం ఇది. ఆషాఢశుక్లఏకాదశిని హరి శయనఏకాదశి అనికూడా అంటారు. ఈ రోజునుంచి కార్తీకశుక్లఏకాదశి వరకు యోగనిద్రలో గడిపిన విష్ణువు తిరిగి ద్వాదశి లేదా ఉత్థానద్వాదశినాడు యోగనిద్రనుంచి బయటకు వస్తాడని ప్రతీతి. ఇక ఈ సమయంలోనే ముఖ్యపండగలన్నీ వస్తాయి. నాగచతుర్థి, వరలక్ష్మీవ్రతం, ఉపాకర్మ(శ్రావణపూర్ణిమ), శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితి, ఋషిపంచమి, శ్రీఅనంత చతుర్దశి, దేవినవరాత్రులు, విజయదశమి, దీపావళి మొదలగు ముఖ్య పర్వదినాలన్నీ దక్షిణాయనంలోనే వస్తాయి. మరో విధంగా దక్షిణాయనంలో పితృపక్షాలు వస్తాయి. ఉత్తరాయణం దేవతలకు ప్రీతికరం కాగా, దక్షిణాయనం పితృదేవతలకు సంబంధించిందిగా భావిస్తారు. ఈ పితృపక్షాలలో తండ్రులు, తాతలు, తల్లి(చనిపోయిన పెద్దలకు) శ్రాద్ధకర్మలు నిర్వహించడం, వారి పేరుమీద పిండప్రదానం, దానధర్మాలు చేయడం ఆనవాయతీగా వస్తోంది.

ఈ సమయంలోనే అయ్యప్పమాలాదీక్షాధారణ, కార్తీకమాసదీక్షలు అన్నీ వస్తాయి. వాతావరణంలో వేగంగా జరిగే మార్పులకు తట్టుకొని రోగాలబారిన పడకుండా ఉండేలా పూర్వీకులు రకరకాల దీక్షలు, వ్రతాలు, ఆచారాలను ప్రవేశపెట్టి ఇటు శారీరకరక్షణతోపాటు, మనిషిని దైవంవైపు నడిపించేలా కాలాన్ని విభజించారు.

ముఖ్యంగా దక్షిణాయనంలోనే పితృదేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన మహాలయపక్షాలు వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే వారి అనుగ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించకపోవడంకూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బ్రతికుండగా తల్లిదండ్రులసేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృరుణం తీర్చుకోవడానికి అది మార్గం మాత్రమే కాదు... కని, పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతాపూర్వకచర్యకూడా ఔతుంది.

# 108 దివ్యదేశాలు

# తిరుమాలిరుంశోలై

## (కళ్లళగర్ కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరుమాలిరుంశోలై అనే దివ్యదేశం తమిళనాడులో మదురై అనే పట్టణానికి ఉత్తరదిక్కులో 20కిలోమీటర్లదూరంలో వలయపట్టి అనే ఒక ఊరిలో నూపురగంగ అనే అద్భుత మైనటువంటి నదితో తెన్ తిరుమాలిరుంశోలై అనేపేరుతో సుమారు 100ఎకరాలస్థలంలో పెద్దకోటతో 112 అడుగుల ఉన్నతరాజగోపురంతో, 5గదులుగల గోపురములు 3, 3 పెద్ద ప్రాకారాలతో, బయట పెద్దమండపాలతో వివిధ ఆశ్చర్యకరమైన ప్రకృతిసోయగంతో ఈ దివ్యదేశం విరాజిల్లుతున్నది.

ఈ దివ్యదేశానికి అళగర్‌కోయిల్, కళ్ళళగర్ తిరుక్కోయిల్, శోలైమలైక్కోయిల్, తిరుమాల్కున్ఱమ్, వనాద్రి, వనగిరి అనేటటువంటి పలునామములు కలవు. స్థలతీర్థం నూపురగంగ అనేటటువంటి శిలమ్బాఱు. ఎక్కడనుంచి వచ్చిందంటే భగవంతుడు త్రివిక్రమఅవతారం ధరించినప్పుడు బ్రహ్మదేవుడు స్వామిపాదాలకు అభిషేకంచేసేసందర్భంలో ఆ పాదములలో ఉన్నటువంటి గొలుసు లేక అందెకు ఈ నీరు తగిలి, అదే నూపురగంగగా ఈనాటికీకూడా ఆ దివ్యదేశంలో ప్రవహిస్తున్నది అని పురాణాలు తెలుపుతున్నాయి. వీరికి అళగర్ అని, మాళాలంకార, మాలిరుంశోలైనంబి అని స్వామివారికి పేర్లున్నాయి. పంచాయుధాలతో భగవంతుడు వేంచేసి ఉన్నారు. ఉత్సవమూర్తి సుందరరాజస్వామి. కళ్ళళగర్ అని పేర్లు.

అపరంజి అనే ప్రత్యేకమైనబంగారంతో మొత్తం ఈ విగ్రహాన్నంతా తయారుచేసినట్లు మనకు చరిత్ర చెబుతుంది. ఈప్రకారంగా పంచాయుధాలతో స్వామి మనకు దర్శన భాగ్యాన్ని కలిగిస్తున్నారు. అమ్మవారు సుందరవల్లి మరియు శ్రీదేవి అనే తిరునామములతో ప్రత్యేకమైన సన్నిధిలో కొలువుతీరి అనుగ్రహిస్తున్నారు. ఇచ్చట వృషభగిరి అదే స్థల వృక్షంగా చెప్పబడుతున్నది. శైవ వైష్ణవ సమైక్యతకు ఈ దివ్య దేశం ఒక నిదర్శనంగా చెప్పబడుతున్నది. ఈ దివ్యదేశాన్ని భూదత్తాళ్వార్, పేయాళ్వార్, నమ్మాళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్, తిరుమంగైఆళ్వార్ అనే ఆరుగురుఆళ్వార్లు దాదాపు 108పాశురాలతో మంగళాశాసనం చేశారు.

| | | |
|---|---|---|
| **దివ్యదేశం** | : | **తిరుమాలిరుంశోలై** |
| **భగవంతుడు** | : | **కళ్ళళగర్, సుందరరాజస్వామి** |
| **అమ్మవారు** | : | **సుందరవల్లి, శ్రీదేవి** |
| **విమానం** | : | **సోమస్కందవిమానం** |
| **తీర్థం** | : | **నూపురగంగ** |
| **ముఖము** | : | **తూర్పుదిక్కు, నిల్చున్నభంగిమ** |
| **మంగళాశాసనం** | : | **భూదత్తాళ్వార్, పేయాళ్వార్, నమ్మాళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్, తిరుమంగైఆళ్వార్** |

### ప్రత్యేకత

బ్రహ్మోత్సవసందర్భంలో చివరగా చక్రస్నానం అవభృథం అని చెప్పబడేవిషయంలో వైగైనదిలో ఈ అళగర్ స్వామి వేంచేసే వైభవం అత్యద్భుతం. జాతిమత భేదాలు వదిలి అందరూకూడా ఈ ఉత్సవంలో పాల్గొంటారు. సమస్త భక్త కోటిని అనుగ్రహిస్తారు స్వామి. దీనిద్వారా భగవంతునియొక్క సౌలభ్యగుణమనేది ప్రకాశమవుతున్నది. తమిళ ఐప్పసి శుక్ల ద్వాదశినాడు నూపురగంగ దివ్యతీర్థంలో భగవంతుడు అభిషేకాన్ని జరిపించుకుంటాడు. ఈ నూపురగంగకు వెళ్ళే దారిలో రాక్కాయికోయిల్ అనే కావల్దైవంసన్నిధి ఉన్నది. అంటే కాపలాకాసే దేవుడు అని. ఇది చాలా ప్రాచీనమైనటువంటి ఆలయం. ఈ అళగర్‌స్వామి అంటే సుందరబాహు ఈ స్వామిని సేవించేదానికి ముందు 18వ మెట్టులో ఉన్న కరుప్పసామి అనే రెండుతలుపులు ప్రసిద్ధంగా చెప్పబడుతున్నాయి. స్థలపురాణం కూడా అత్యద్భుతంగా ఉంటుంది. అలాగే 18వమెట్టుగా ఉన్న కరుప్పణసామి ఐతిహ్యాన్ని మనకు పురాణం తెలియజేస్తున్నది. తిరుమాలిరుంశోలై ప్రవేశద్వారాన్ని దాటి 4అడుగులు వేసిన తరువాత రెండుతలుపులు మనకు ఒకేవిధంగా బ్రహ్మాండంగా కనిపిస్తాయి. ఈ జంటతలుపులకు అన్నిపూజలుకూడా జరప బడతాయి.

దీనికి కారణం ఏమిటంటే కేరళదేశరాజు ఒకరు ఈ తిరుమాలిరుంశోలై అనే దివ్యదేశానికి వచ్చి కళ్ళళగర్ అనే టటువంటి ఈ సుందరరాజస్వామిని దర్శించుకుంటూ ఉన్నప్పుడు ఆ స్వామివారియొక్క దివ్యమంగళవిగ్రహంలో మునిగి మోహించినటువంటి ఆ రాజు ఈ భగవంతున్ని ఎలా అయినా తన దేశానికి రప్పించుకోవాలని కుతూహలపడ్డాడు. అచ్చట ఉన్నటువంటి విష్ణుభక్తులు అడ్డుకోగా భక్తులయొక్క భక్తినిచూసి ఆశ్చర్యానికి లోనైనటువంటి రాజు తన రాజ్యానికి బయలుదేరి మాంత్రికశక్తితో ఈ దేవుడిని వశపరుచు కోవాలి అని భావించి కేరళదేశంలో వశ్యమంత్ర తంత్ర శాస్త్రాలలో ప్రసిద్ధిచెందినటువంటి 18మందిని ఈ దివ్యదేశానికి పంపించడం జరిగినది.

వీరు అచటికి వెళ్ళి ఒకొక్కమెట్టుకి ఒకొక్కరు 18మంది కూర్చుని స్వామిని వశం చేస్తూ ఉన్న సందర్భంలో స్థానికభక్తులు దీనిని తెలుసుకుని వాళ్లందరినీ కూడా సమాధి చేసేశారు. ఈ 18మందికి సహాయం చేయడానికి వచ్చినటువంటి కావల్‌దైవం భగవంతుడియొక్క అందంలో మునిగి తను ఏమి చేయలేని నిస్సహాయస్థితికి చేరి తాను ఊరిలో ఉన్నటువంటి పెద్దవాళ్ళతో మాట్లాడి నేను ఈ దివ్యదేశాన్ని వదిలిపెట్టి వెళ్లను. ఎప్పుడూ ఈ స్వామివారియొక్క దివ్యమంగళవిగ్రహాన్ని నేను తనివితీరా అనుభవిస్తూ ఉండాలి అని, అంచేత నేను ఒక తలుపుగా మారిపోతాను అని చెప్పాడు. ఈ 18మెట్లను కాపలాకాయ డానికి తనను అనుమతించాలి అని అతడు కోరగా భగ వంతుడుకూడా అంగీకరించారు. అర్ధయామంలో జరిగేటటు వంటి నివేదనం ఆ కాపలాదైవానికి ఇవ్వడం జరిగినది.

ఈ విధంగా ఎంతోమంది ఆళ్వార్లు, ఆచార్యులు అందరూకూడా మైమరచి ఈ దివ్యదేశాన్ని స్తోత్రం చేశారు. అటువంటి దివ్యదేశంలో వేంచేసి ఉన్నటువంటి స్వామిని మనందరంకూడా దర్శించి ఇహపరసౌఖ్యాన్ని పొంది తరిద్దాం.

**ధ్యానశ్లోకం -**

పుణ్యే శ్రీ వృషభాచలే వసతి యః సౌందర్యవల్ల్యాన్వితః
రూపన్నిర్జితలబ్ధకోటిమదనో నామ్నా చ యస్సుందరః।
యో వై నూపురగఙ్గయాశ్రితపదః చంద్రాఖ్య వైమానికః
వజ్రీదిగ్వదనః ప్రభాతి హృదయే ధర్మేణ సాక్షాత్కృతః।

ఓం నమో వేంకటేశాయ





# అవతరించినవేళ..

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో శ్రీ సుందరరాజ స్వామివారి అవతారనక్షత్రం దినమైన ఉత్తరాభాద్రనాటికి పూర్తిఅగునట్లుగా మూడురోజులపాటు శ్రీ సుందర రాజస్వామివారికి వార్షిక అవతారోత్సవాలు ఘనంగా, వైభవంగా జరుగుతాయి. ఈ మూడురోజులపాటు శ్రీసుందరరాజస్వామివారి మూలమూర్తులకు, ఉత్సవమూర్తులకు ఘనంగా అభిషేక అర్చన నివేదనలు జరుగుతాయి. ప్రతిరోజు సాయంత్రం ఒక్కొక్కవాహనంపై శ్రీ స్వామివారికి ఊరేగింపులు నిర్వహిస్తారు.

సుమారు నూరేండ్లనాడు అప్పటి తి.తి.దేవస్థానం విచారణకర్తలు అయిన మహంతుల ఆధ్వర్యంలో శ్రీసుందర రాజస్వామివారి గర్భాలయం, గోపురం జీర్ణోద్ధరణ, ఆలయ శిఖరంపైన బంగారుకలశప్రతిష్ఠ, ఆలయమహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహింపబడ్డాయి. అనాటి నుండి శ్రీసుందర రాజస్వామివారికి అవతారమహోత్సవాల పేరిట ప్రతి సంవత్సరం మూడురోజులపాటు వైభవంగా ఈ ఉత్సవాలు జరుపబడుతూనే ఉన్నాయి. ఇటీవల 2006 జ్యేష్ఠమాసంలో మహాఅవతారోత్సవాలు అత్యంతవైభవంగా ఘనంగా నిర్వహింపబడ్డాయి.

**తిరుచానూరు, శ్రీసుందరరాజస్వామివార్ల అవతారోత్సవాల సందర్భంగా...**
**(05-07-2026 నుండి 07-07-2026 వరకు)**





## శ్రీ సుందరరాజస్వామివారి అవతారోత్సవాలు,
తిరుచానూరు

(05-07-2026 నుండి 07-07-2026 వరకు)

# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవాలు,

శ్రీనివాసమంగాపురం

(17-07-2026 నుండి 19-07-2026 వరకు)





## శ్రీ కపిలేశ్వరస్వామివార్ల పవిత్రోత్సవములు, తిరుపతి

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 25-07-2026 | శని | --- | అంకురార్పణ |
| 26-07-2026 | ఆది | పంచమూర్తులకు స్నపనతిరుమంజనం | పవిత్రమండలపూజ, హోమములు |
| 27-07-2026 | సోమ | గ్రంథిపవిత్రసమర్పణ, వ్రతచరి | పవిత్రప్రతిష్ఠ, వ్రతచరి |
| 28-07-2026 | మంగళ | పవిత్రసమర్పణ, పవిత్రోత్సవ సమాప్తి | పంచమూర్తుల వీధిఉత్సవము |













చిత్తూరు జిల్లా, కుప్పంలో ఉన్న ప్రసన్న తిరుపతి గంగమ్మకు జాతర సందర్భంగా మే 20, 2026న తి.తి.దే. శ్రీవారి సారె సమర్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడు దంపతులు. అందులో పాల్గొన్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., పాలకమండలి సభ్యులు మరియు అధికారులు



ఢిల్లీ నయాతి హెల్త్‌కేర్ & రీసెర్చ్ ఆగ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మే 30, 2026న తి.తి.దే.కి రూ.1.13 కోట్లు విలువైన ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సు పత్రాలు, తాళాలను విరాళంగా స్వీకరిస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు మరియు తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్.,



తి.తి.దే. శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు మే 06, 2026న తి.తి.దే. పాలకమండంలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుకు రూ.2.50 కోట్లను విరాళంగా అందిస్తున్న పశ్చిమబెంగార్ రాష్ట్రం, కోల్‌కత్తా, హిమాద్రి ఫౌండేషన్



హనుమజ్జయంతి సందర్భంగా తిరుమలలోని జాపాలి శ్రీఆంజనేయస్వామివారికి తి.తి.దే. తరపున మే 12, 2026న పట్టువస్త్రాలు సమర్పిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., మరియు అధికారులు



తి.తి.దే. ప్రాణదాన ట్రస్టుకు మే 12, 2026న రూ.1.03కోట్ల విరాళాన్ని తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., కి అందిస్తున్న ముంబై భక్తుడు శ్రీ విజయ్ రమేష్‌చంద్ర









*2026, జూలై 29న గురుపూర్ణిమ సందర్భంగా...*

# గురువులకే గురువు

*– శ్రీ వద్దిరాజు జనార్దనరావు, 99893 50596*
*108 వినాయకచిత్రాలు – డా॥ శ్రీధరన్ కౌలికి*




*"గురుః స్సాక్షాత్ పరబ్రహ్మ"*– అటువంటి పరబ్రహ్మతత్త్వం గల ఓంకార స్వరూపుడు, జ్ఞానప్రదాత, గురువులకు గురువుగా, మార్గదర్శకునిగా తొలిపూజలందు కొంటున్నాడు శ్రీ గణేషుడు.

ఏనుగుముఖరూపంలో కనిపించే ప్రసిద్ధ ఓంకార దేవతాస్వరూపం వినాయకుడు. ఓం అంటే పరమాత్మ ప్రతీక. ఆ ఓంకారమే ప్రణవనాదం. సమస్తానికి మూలం. వేదాదిలో ఓంకారమే గణపతి అని తెలుపుతారు. గణేష పురాణంలో స్తుతించబడిన 'మహాగణపతి' సమస్తదేవతలకు ప్రథమగురువు. ఇతనికి అనేక నామాలు ఉన్నట్లు గణేశ, ముద్గలపురాణాలు తెలుపుతున్నాయి. సకలలోకాలను సృష్టి చేయగల శక్తి సామర్థ్యాలను నాకు గణేషుడు నేర్పాడని బ్రహ్మ వ్యాసమునికి తెలిపాడు. ఒకసారి మరీచిమహర్షి త్రిలోకాల్లో గొప్పవాడైన వారు ఎవరున్నారని బ్రహ్మను అడుగగా అపుడు బ్రహ్మ వినాయకుడేనని తెలిపాడట. సమస్తవిద్యలకు అధిపతి, గురువు వినాయకుడు. దేవతలకు ఆరాధ్యనీయునిగా, మంత్రస్వరూపునిగా, అనంతతత్త్వస్వరూపునిగా సంప్రదాయాన్ని గ్రహింపజేయు వానిగా, ఆచార్యునిగా, గురువుగా మూడులోకాల్లో కొలువబడుతున్నాడు వినాయకుడు.









## బ్రహ్మాదిదేవతలు కొలిచే ఆదిదేవుడు

బ్రహ్మాదిదేవతలు సకలకార్యాలు ప్రారంభిస్తూ ఎవరిని సమస్కరించి, పూజించి కృతకృత్యులవుతున్నారో అట్టి గజాననునికి నమస్కారం.

















శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే॥

తొలిపూజలందుకునే పరబ్రహ్మస్వరూపమైన గణపతికి మ్రొక్కుతూ మనం ఏ కార్యం తలపెట్టిన గణపతి ఆరాధనతో ప్రారంభిస్తాం. పండుగలు మన భారతీయసంస్కృతికి ప్రతిబింబాలు. అవి ఆచారాన్ని నిలబెడతాయి. ప్రతిపండుగ వెనుక ఏదో ఒక పరమార్థం, ప్రయోజనం దాగి ఉంటుంది.




**విద్యాధిదేవత:** సామవేదులు విద్యాదేవతగా భావించి అక్షరాభ్యాసం “శ్రీగణేశాయ నమ” అని ప్రారంభిస్తారట.



**విద్యాపతి:** కల్పం, వ్యాకరణ, నిరుక్త, జ్యోతిష్యం, ఛందస్సు, ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం పూర్వ, ఉత్తరమీమాంస, న్యాయంపురాణం, ధర్మ శాస్త్రం, ఆయుర్వేదం, ధనుర్వేదం, నీతిశాస్త్రం, విద్యాధిపత్యం శ్రీగణేశునిదగ్గర ఇవన్నీ ఉంటాయి. అందుకే విద్యాపతి అని కీర్తిస్తుంటారు. ఏ కార్యం తలపెట్టిన తొలిపూజలు అందుకునే దేవుడు. “అలా మూడులోకాల్లోను దేవతలతోపాటు మానవులుకూడా తమ పనులు ప్రారంభించేటప్పుడు వినాయకపూజ చేయడం మొదలైందని శాస్త్రవచనం.




**గణాధిపతి:** గణాలకు అధిపతిని నియమించవలసిన అవసరం ఏర్పడింది ఒకప్పుడు. ఆ సమయంలో వినాయకుడు ఆదిపూజలందుకునే గణనాయకు డయ్యాదన్నది తెలిసిందే.




**మాతృదేవో భవ, పితృదేవో భవ:** తల్లిదండ్రులను పూజించేవారికి ముల్లోకాల్లో తిరుగుండదని, అన్ని జయాలు కలుగుతాయని వినాయకుడు నిరూపించి చూపాడు.

**వినాయకస్వరూపం:** పెద్దతల, పెద్ద పెద్దచెవులు, తొండము, చిన్ననోరు, చిన్న కళ్ళు, పెద్దబొజ్జ, ప్రసన్నవదనం ప్రస్ఫుటంగా వినాయకస్వరూపం చూస్తే గోచరిస్తాయి. ఎలుకవాహనంతో చతుర్భుజునిగా అభయహస్తంతో దర్శనమిస్తాడు.











     

   

   

వినాయకుని పెద్దతల విశాలదృక్పథంతో ఆలోచించమని తెలుపుతుంది. అలాగే వివేకాన్ని పెంచుకుని ప్రయోజనకరమైన ఆలోచనలు పెంచుకోవాలని, పెద్దచెవులతో మంచిసలహాలు, సూచనలు వినాలని, శ్రవణంవల్ల అనేకలాభాలు కలుగుతాయని సూచిస్తున్నది. శ్రద్ధగా, మనసుపెట్టి వినడం తెలుసుకోవాలని తెలుపుతున్నది. చిన్నకళ్ళు సూక్ష్మదృష్టి పరిశీలన చేయమని తెలుపుతున్నాయి. తొండం నిండుగా గాలి పీల్చుకోవాలని తెలుపుతున్నది. చిన్ననోరు మౌనంగా ఎదగమని సూచిస్తోందని పండితులు, పెద్దలు తెలుపుతున్నారు. ఇలా వినాయకుని స్వరూపం ముక్కోటిదేవతలందరిచే తొలిపూజలు అందుకుంటున్నది.

**పరబ్రహ్మస్వరూపుడు:** పురాణాలు గణపతి నిరాకార, సాకారతత్త్వం, రూపసౌందర్యం వర్ణించడం, సర్వవాఙ్మయస్వరూపునిగా, ఆనందమయునిగా, పరబ్రహ్మస్వరూపునిగా గొప్పగా తెలిపాయి. ఎవరెవరు ఏఏ కార్యాలు తలపెట్టినా ముందుగా పూజలందు కునే ఆదిదైవముగా గణపతిని పేర్కొన్నాయి.

**పురాణపురుషుడు:** శ్రీ వేదవ్యాసముని అందించిన గణేశపురాణంను, ముందుగా భృగుమహర్షికి తెలుపగా అతను సోమకాంతమహారాజుకు తెలిపారు. తరువాత వేదవ్యాస శిష్యుడైన సూతమహర్షి శౌనకాదిమునులకు గణేశునిగురించి వివరించారు. అలా లోకానికి అందించారు.

శ్రీ మహాభారతరచనకు బ్రహ్మ ఆదేశానుసారం వ్యాసుడు విఘ్నేశ్వరుని స్మరించగా అతను వచ్చి శ్రీమహాభారతాన్ని వ్యాసుడు చెప్పగా కలం ఆపకుండా విఘ్నేశ్వరుడు రచన చేశాడు.

**ఇంద్రునికి శక్తి ప్రసాదించిన ఆదిదేవుడు:** తాను దేవతాచక్రవర్తినని దేవతలకు రాజని ఆధిపత్యంవల్ల వచ్చిన గర్వంతో ఉన్న ఇంద్రుడు ఒకసారి దుర్వాసమహర్షి కోపానికి గురై పదవీభ్రష్టుడై శక్తి లేక బలహీనుడుగా ఉన్న తరుణంలో నారదమునీంద్రుల



    











సలహాతో విష్ణుమూర్తిని ప్రార్థించగా అప్పుడు విష్ణుమూర్తి అనేక విధాలుగా ఇంద్రునికి నచ్చచెప్పి రాక్షసులతో చెలిమి చేసుకోమని చెప్పాడు.

**అమృతంకోసం:** పదవీభ్రష్టత, శక్తిహీనతకు ఋషి శాపవిమోచనానికి అమృతమథనం తప్పక చేయవలసి ఉంటుందని తెలిపాడు విష్ణువు ఇంద్రునితో. అందుకు రాక్షసుల సహకారంకూడా తీసుకోవాలని చెప్పాడు.

**మందరపర్వతమథనం:** అలా ఇంద్రుడు విధిలేక రాక్షసులతో కలసి మందరపర్వతం. చిలకడానికి ఒప్పందం చేసుకున్నారు. వాసుకి తోడుగా దేవదానవులు మందరపర్వత మథనం గావించారు. కానీ అనేక ఆటంకాలు వచ్చాయి. వాటిని అధిగమించాలంటే శక్తి చాలటం లేదు ఇంద్రునికి. ఇంతలో వచ్చింది అందులోంచి హాలాహలం వాటి మహా జ్వాలలు అంతా వ్యాపించి ధహించివేస్తున్నాయి. ఈ ఆటంకంనుంచి ఎలా బయటపడాలో తెలీక ఇంద్రుడు విలపిస్తుండగా నారదమునీంద్రులు వచ్చి మహాగణపతిని ఆరాధించడం మరిచారు. ఏకార్యం చేసినా ముందుగా గణపతిపూజ చేయాలి కదా. వెంటనే గణపతిని ప్రార్థించమని చెప్పాడు. ఇంద్రుడు తపస్సు మొదలుపెట్టి గణపతిని ప్రసన్నం చేసుకున్నాడు. అపుడు గణపతి ఓ ఇంద్రా! నీ గర్వం, అహంకారం నిన్నింత బాధలకు గురి చేసింది. నీ తప్పు నీవు తెలుసుకున్నావు కాబట్టి, నీవు అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను విను అని "సంకష్టహరచతుర్థి" వ్రతవిధానం చెప్పాడు వినాయకుడు.

**సంకష్టహర చతుర్థివ్రత ఆచరణ:** ఇంద్రుడు నమస్కరించి గణాధిపతిని ఆ విధానం చెప్పమన్నాడు ప్రార్థిస్తూ. కృష్ణపక్షచతుర్థినాడు స్నానసంధ్యాధులు బ్రహ్మముహూర్తంలో ముగించి ఉపవాసం ఉండి రోజంతా దైవధ్యానంలో ఉండి చంద్రోదయంసమయంలో యథావిధి పూజాదికాలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించు భక్తితో. నీకు తప్పక జయం కలుగుతుందని తెలిపాడు ఇంద్రునికి గణేశుడు.

గణపతి చెప్పినట్లుగానే ఇంద్రుడు మొదటిసారి చేయగా లోకాలను దహించే హాలాహలాన్ని పరమశివుడు వచ్చి మ్రింగి నీలకంఠుడైనాడు. ఆ విధంగా ఆ గండం గడిచింది. ఇలా ఒక్కొక్క సంకష్టహరచతుర్థిని వరుసగా చేస్తూ వచ్చే ఆపదలను గట్టెక్కి














ఆ తర్వాత అమృతాన్ని పొంది తిరిగి తాను గొప్ప శక్తివంతుడుగా ఇంద్రపదవి దక్కించుకున్నాడు.

**గరికపూజ:** వినాయకుడిపూజలో, గరికతో చేసే పూజ విశిష్టమైనది. వాటితో పూజచేస్తే గణేశుడు ప్రీతి నొందుతాడట. మునీశ్వరులు భక్తితో 21 గడ్డిపోచలతో గణేశుడిని పూజించగా ఆనందించాడట.




అగ్నిజ్వాలసమానుడైన అనలాసరుడు అనేవాడు తన వేడి అగ్నిజ్వాలలతో లోకాలను దహించివేస్తుండేవాడు. అప్పుడు దేవతలందరు విష్ణువుని శరణు వేడగా అప్పుడు విష్ణువు గణేశుని ప్రార్థించుమని దేవతలకు సలహాలు ఇచ్చాడట.

**దేవతలు గణేశుని పూజించుట:** విష్ణువు ఆదేశానుసారం దేవతలు గణేశుని ఆర్తితో స్తుతించారట. అప్పుడు బాలగణపతిగా సాక్షాత్కరించి, వారికి ఆభయమిచ్చి ఆ అనలాసరుణ్ణి మింగేశాడట వినాయకుడు. ఆ అనలాసరుడి ఆగ్నిజ్వాలలతో వినాయకుడు వేడితాపంతో ఉన్నాడట. ఆ తాపాన్ని నివారించడానికి ఇంద్రుడు చంద్రుణ్ణి, విష్ణువు పద్మాన్ని ఇలా దేవతలు ఒక్కొక్కటి ఇచ్చినా ఆ జ్వాలతాపం గణేశునికి తీరలేదట. అప్పుడు మునులు 21 గడ్డిపోచలు భక్తితో వినాయకుడికి సమర్పించి ప్రార్థించారట. అప్పుడు వినాయకుడు సంతుష్టి చెందాడట.




పరమశివుడు సైతం త్రిపురాసురసంహారం చేయడానికి ముందు విజయం చేకూరాలని గణేశుని ప్రార్థించాడట. ఏ పూజ చేస్తున్నా ముందుగా ఆదిదేవుడుగా పూజలందుకుంటున్నాడు.




గురువుగా, మార్గదర్శకునిగా, స్నేహితునిగా, విద్యాప్రదాతగా, విఘ్న నివారకునిగా ఇలా అనేకవిధాలుగా మన జీవితాల్లో వెలుగు నింపే దేవదేవుడు వినాయకుడు. అనేకవ్రతాలు, పూజలతో భక్తులు పరవశించిపోతారు. అలాంటి మంగళమూర్తి గణపతిని కొలిచి కీర్తిస్తుంటారు భక్తులు.

















- భారతజ్యోతి ఆచార్య డా॥ యోగశ్రీ సి.ఎస్.రాయుడు, 98486 18095

ఈ పదం సంస్కృతపదం వీణనుండి ఉద్భవించింది. సంగీతంలో ఉపయోగించే ఒక తీగవాయిద్యం ఇది. భారతదేశానికి చెందిన ఒక పురాతన, అత్యంత పవిత్ర, ప్రసిద్ధ వాయిద్యపరికరం. సంగీతపరంగా వీణ అత్యంత మధురమైన, సంక్లిష్టమైన ధ్వనులను, సప్తస్వరాలను సృష్టిస్తుంది. ఇది దేశవ్యాప్తంగా భారతీయసంస్కృతిని సూచిస్తుంది. భారతీయ శాస్త్రీయ సంగీతంలో వాయించే ప్రధాన పరికరాలలో ఒకటి. వీణకు విపంచి, వీణియ, వినా, భినా, జీనా, వీణేవంటి వివిధపేర్లు ఉన్నాయి. ఇది వాయిద్యమేకాకుండా జ్ఞానం మరియు సంగీతనైపుణ్యాన్నికూడ సూచిస్తుంది. దీనికి సాధారణంగా నాలుగుభాగాలు ఉంటాయి. అవి కుండ, దండియాళి, సొరకాయబుర్ర మొదలైనవి. దీనిని వాయించేవారిని వైణికులు అని పిలుస్తారు. కుడిచేతితో మీటుతూ, స్వరాలకు అనుగుణంగా ఎడమచేతితో అదిమిపట్టి ఆయాస్వరాలను పలికిస్తారు. రుద్రవీణ, చిత్రవీణ, విచిత్రవీణ, సరస్వతివీణ, బొబ్బిలివీణ అని వీణలోని అనేకరకాలు.

## వేదాలలో వీణప్రస్తావన

హిందూసనాతనసంస్కృతిలో సమగ్రమైన జీవితవిధానంలో సంగీతం ఒక అంతర్గతభాగం. భారతీయ సంప్రదాయంలో సంగీతం ఓంకారంనుండి ఉద్భవించింది. సంగీతంలో పలురకాల వాయిద్యాలను ఉపయోగిస్తారు. వీటిని విస్తృతంగా నాలుగుగ్రూపులుగా విభజించవచ్చు. అవి 1)తంత్రివాయిద్యాలు 2)సుషిరవాయిద్యాలు 3)అపనర్ధవాయిద్యాలు 4)ఘనవాయిద్యాలు

భారతీయశాస్త్రీయసంగీతంయొక్క మూలాలు వేదనాగరికతనాటివే. సామవేదం సంగీతంగురించి ప్రస్తావించింది. వేదాలు సంగీతంయొక్క ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గుర్తించాయి. అప్పటినుండే సప్తస్వరాలభావన ఉంది. వేదాలను పఠించేటపుడు మూడురకముల స్వరాలైన ఉదాత్త, అనుదాత్త మరియు స్వరిత అనువాటిని వాడుతారు.

శబ్దబ్రహ్మ అంటే శబ్దమే పరబ్రహ్మ స్వరూపము ధ్వని లేదా నాదం. నాద బ్రహ్మ అని పిలుస్తారు. నాదోపాసనద్వారా బ్రహ్మను పొందవచ్చు. వేదాలు దైవం యొక్క ధ్వని అవతారం. మొదటి వేదమైన ఋగ్వేదంలో వీణను 'వణ' అని పిలిచేవారు. వేదమంత్రోచ్చారణలతో వీణ ముడిపడి ఉంది. పఠించేటప్పుడు వీణను ఉపయోగించేవారు. అథర్వణవేదం విల్లు తీగయొక్క సంగీతధ్వనిని ఘోషరూపంలో ప్రస్తావించారు. విల్లుతాడు విల్లులద్వారా ఉత్పత్తి అయ్యే తంత్రశబ్దం ఆధారంగా వీణవంటి తీగ వాయిద్యాలు రూపొందించబడ్డాయి. దీనిని అథర్వణవేదంలో విల్యాజ్ అని పిలుస్తారు. ఇది ఒక పురాతన వీణ.

## 1) కచ్ఛపి- సరస్వతి వీణ

మాత సరస్వతి వేదమాత, హిందు ధ్వనిదేవత, బ్రహ్మ దేవేరి, సంగీతదేవత. ఆమెకు వీణ, పుస్తకధారిణి అని పేర్లు. వీణ హస్తభూషణంగా, హంసవాహినిగా, వీణ-పాణి అని పిలుస్తారు. సరస్వతి అను పేరు సరస్ అను సంస్కృతమూలంనుండి ఉద్భవించింది. అంటే సరస్సు, ప్రవాహం. వతి అంటే ప్రవాహంనుండి వచ్చింది.



సరస్వతినది పవిత్రనదులలో ఒకటి. ఆమె జల లక్షణాలు, ధర్మాలు కలిగిఉండి, ప్రవాహాలు, శబ్దాలు, గలగలలు, జల పాతాలహోరు, వడివడిగా సాగే నీరు ప్రకృతి మనకు అందించిన సంగీతవాయిద్యాలు.

వీణయొక్క దైవికనామము కచ్ఛపి. కచ్ఛపి అంటే ఏమిటి? ఆడ తాబేలు అని పేరు. తాబేలు తన కార్యకలా పాలలో నిమగ్నంగా లేనపుడు తన ఇంద్రియాలను ఉపసంహ రించుకుంటుంది. ఈ ప్రకారం మానవులుకూడ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, కళలను, విద్యలను పొందాలనుకొనేవారు తమ ఇంద్రియములను బాహ్యావృత్తులనుండి త్యజించి, అంతర్ముఖమై ఏకాగ్రతతో, మనస్సును చలించనీయకుండ నిగ్రహించవలసి ఉంటుంది. అటువంటివారు మాత్రమే సంగీతాన్ని ఆస్వాదిస్తారు, సంగీతవిద్వాంసులవుతారు. కీర్తిప్రతిష్టలు పొందిన కళాకారుల, సంగీతవిద్వాంసుల జీవితం వెనుకఉన్న రహస్యమిదే!

## 2) మహతి-నారదుడి వీణ

నారదుడు సంగీత వాయిద్యవీణను పట్టుకొని వాయిస్తు న్నట్లు చిత్రీకరించబడ్డాడు. భారతదేశ పురాతన సంగీత వాయిద్య గురువులలో ముఖ్యులుగా గుర్తించబడ్డాడు. నారదుడి వీణ శతతంత్రివీణ, అనగా నూరుతంత్రులతో కూడిన దివ్యవీణ. దీనిని దేవదత్త అనుపేరుతోకూడ పిలుస్తారు.

తన వీణపై నారాయణనామాన్ని జపిస్తు స్వేచ్ఛా విహారం చేస్తుంటాడు. వీణతంత్రులనుండి నిరంతరం నారాయణ నామం ప్రతిధ్వనిస్తుంటుంది. సదా నారాయణనామం సంకీర్తన చేస్తూ, వీణను మీటుతూ తన భజనలను, కీర్తనలను, విష్ణుకథలను గానం చేస్తుంటాడు.

నారాయణ, నారాయణ అనే శ్రీహరిమంత్రం నిరంతరం జపం చేస్తూ త్రిలోకాలు సంచరిస్తుంటాడు. నారద మహర్షియే మొదట వీణ అనే సంగీతవాయిద్యాన్ని కనిపెట్టారు. వీరు తాన్పూర అనే తీగల వాయిద్యాన్ని కనిపెట్టారు. ఇది పురాతనవీణగా పరిగణింపబడింది.

రెండుపదాలసంయోగంతో ఈ పదం ఏర్పడింది. ఇవి 'మహ' మరియు 'మతి' అన్న పదాలు. మహా అంటే గొప్ప, లేదా పెద్ద. మతి అంటే బుద్ధి లేదా తెలివి అని అర్థం. అనగా వీణలో గొప్ప జ్ఞానం కలిగి ఉంది. మరియు దీనిని కలిగియున్న గొప్పవ్యక్తి అని నారదుని సూచిస్తుంది.

తెలుగులో మహతి అంటే గొప్ప లేదా మహత్తరమైనది, అద్భుతమైనది, గౌరవప్రదమైనది, ప్రశంసనీయమైనది అని అర్థం. మహతిని కలిగియున్నవారి వ్యక్తిత్వంలో గొప్ప శక్తి, జ్ఞానం ఉంటుంది. దీనిని భగవంతుని కీర్తించే సాధనంగా చెప్పవచ్చు. వీరు మనస్సులో దైవికకరుణను కలిగి ఉంటారు. దేవుని అనుగ్రహానికి, కృపకు గుర్తు. తాత్త్వికధార్మికలక్షణాలను



కలిగిఉంటుంది. ఇది సంస్కృతపదం మహత్‌నుండి ఉద్భవించింది.

### 3) రుద్రవీణ- శివుడి వీణ

భారతీయ శాస్త్రీయ సంగీత ప్రపంచంలో, తంత్ర వాయిద్యం కుటుంబంలో అతిపురాతన, గౌరవించబడిన దైవిక వాయిద్యం రుద్రవీణ. రుద్ర మరియు వీణ అను రెండు పదముల కలయికతో ఏర్పడినదే రుద్రవీణ. ఇది శివుడి రూప మైన రుద్రుడిపేరుతో పిలువబడుతుంది. శివశక్తి వాయిద్యం. భారతీయసంస్కృతిలో దైవికవాయిద్యంగా పరిగణించబడుతుంది.

పార్వతి సౌందర్యంనుండి ప్రేరణ పొందిన శివుడు ఈ వీణను సృష్టించాడు. ఆమెరూపాన్ని స్ఫురిస్తూ, పార్వతిదేవిని



ప్రసన్నం చేసుకోవటానికి రూపొందించాడు. ఇది హిందుస్థానీ శాస్త్రీయసంగీతంలో ఉపయోగించే పెద్ద తీగల వాయిద్యం. ఇది ధృపద్‌శైలికి సంబంధించినది. సంగీతరాగానికి, రాగా లాపనకు ఉపయోగిస్తారు. ఇది లోతైన ప్రతిధ్వనించే శబ్దాన్ని ఇస్తుంది.

దీనిని వెదురుతో, రెండుసొరకాయల మధ్య పొడవైన దండంతో చేస్తారు. సరస్వతివీణకు భిన్నంగా, నిలువుగా లేదా ఎత్తైనకోణంతో పట్టుకొని వైణికుడు అనుపేరుతో పిలువబడే వ్యక్తి వాయిస్తాడు. ఈ వీణావాయిద్యాన్ని శ్రీలంకాధిపతి రావణా సురుడు మానసికోల్లాసంకోసం శివుణ్ణి ధ్యానిస్తూ, వాయిస్తూ తన్మయత్వానికి లోనయ్యేవాడట. అంతగొప్పది వీణ.

### 4) తంబుర- అన్నమాచార్యుడి వీణ

తాళ్లపాక అన్నమాచార్య తాళ్లపాక అన్నమయ్యగా ప్రసిద్ధి. వీరు వేంకటేశ్వరస్వామిపై సంకీర్తనలను రచించారు. వీరి రచనలు తెలుగు మరియు సంస్కృతభాషల్లో ఉన్నాయి. అన్నమయ్య పాటలు అన్నీ స్వామి శృంగారం, లాలిపాటలు, భక్తికి సంబంధించిన కీర్తనల సమాహారం. ఈ కీర్తనలు నేటికి కర్ణాటకసంగీతంలో భక్తిసంప్రదాయంలో ప్రముఖస్థానాన్ని పొంది ఉన్నాయి. వీరు ప్రముఖ స్వరకర్త, వీరి కీర్తనలు తెలుగు పదకవితాసాహిత్యంలో కీలకమైన కృతులుగా పేరు గడించాయి.

తన కీర్తనలను పాడటానికి వీరు సాధారణ తంబుర సంగీతవాయిద్యపరికరాన్ని ఉపయోగించారు. తన సంగీత వాయిద్యం అయిన తంబురను పొందిన వృత్తాంతం భక్తిరసంతో కూడిన ఒక అద్భుతమైన కథ. తంబుర సాధనం మరియు పాటలు, కీర్తనలు పాడే జ్ఞానం సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామి మరియు అలమేలుమంగ అనుగ్రహంవల్లనే లభించాయి.

బాల్యంనుండే శ్రీమన్నారాయణుడి భక్తుడైన అన్నమయ్య తిరుమల వేంకటేశ్వరుని దర్శనంకోసం కాలినడకన ప్రయాణి స్తుండగా, అతనికి దైవానుగ్రహంతో తంబుర లభించింది. ఆ సమయంలో వారికి ఒక దివ్యమైన అనుభూతి కలిగింది. అన్నమయ్య పాడుకొనే తంబుర శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రసాదంగానే భావిస్తారు.

దీనితో అన్నమయ్య 32,000లకు పైగా సంకీర్తనలు స్వామిపై రచించారు. అన్నమయ్య ఉపయోగించిన వాయిద్యం తంబురకూడ ఒకవిధమైన తంత్రీవాయిద్యపరికరం.

ఇందులో చాలరకాలు ఉన్నాయి. సొరకాయబుర్రతో చేసినవాటికి రెండు లేదా ఒక తంత్రి మాత్రమే ఉంటుంది.



వీటిని తత్త్వాలుగా పాడేవారు. ప్రక్కవాయిద్యాలతో పని ఉండదు. కేవలం తాళాలను మాత్రం ప్రక్కవాయిద్యాలుగా ఉపయోగిస్తారు. అన్నమయ్య ముఖ్యంగా స్వరపరిజ్ఞానం, వాగ్గేయకత్వంలో పాటలు రచించి, వాటిని సంకీర్తనలరూపంలో ఆలపించారు. తన గొంతుతో, సంకీర్తనలతో సంగీతాన్ని సృష్టించారు. వారికి గొంతు ప్రధానసాధనం. వాటికి స్వరాలు కూర్చారు. ఇది ఒక విలక్షణ సంగీతం.

### 5) కళావతి- తుంబురుడి వీణ

పురాణంప్రకారం తుంబురుడు ఒక గంధర్వుడు. సంగీతంలో ప్రవీణునిగా సుప్రసిద్ధుడు. శివుని డమరుకనాదం నుంచి ఉద్భవించిన సంగీతాన్ని విశ్వవ్యాప్తితం చేయ సంకల్పం కలవాడు. తుంబురుడు నారదునితో సమానుడు. జంట సంగీత కారులు. వీరినిగూడ ఒక సంగీతగురువుగా గుర్తించడమనే పరంపర ఉంది. తుంబురుడు మరియు నారదుడు జంట సమానసంగీతవిద్వాంసులు. తుంబురుని వీణకు కళావతి అని పేరు. గంధర్వులలో గొప్ప గాయకుడు, సంగీతవిద్వాంసుడిగా ప్రసిద్ధి చెందాడు. వీణ వాయించడంలో తుంబురుని ప్రతిభకు ప్రజాదరణ మరియు గుర్తింపు ఉంది. వీరు నారదమహర్షికి సహచరుడు.



వీరి వీణ రత్నాలు, వజ్రాలతో అలంకరించబడి ఉంటుంది. ఇది అతని ప్రత్యేక సంగీత ప్రతిభకు నిదర్శనం. సితార్‌వలె ఉండే ఒక సంగీతవాయిద్యపరికరం పేరు తుంబుర అంటారు. దీని పర్యాయపదం తంబుర, దేవతల ఆస్థానాలలో సంగీతకచేరీలుచేస్తూ, విష్ణువును ఎల్లప్పుడు స్తుతించేవాడు.

కళావతి అంటే తెలుగులో కళాకారిణి లేదా సరస్వతి దేవి అని అర్థాలు ఉన్నాయి. కళ అంటే నైపుణ్యం లేదా కళాత్మకత. కావున, కళావతి అంటే కళను ప్రదర్శించే స్త్రీ లేదా కళాకారిణి. సరస్వతిదేవికికూడ కళావతి అని పేరు. వీణకు పర్యాయపదం కళావతి.

### 6) చిత్రవీణ

దీనిని గోటువాయిద్యం అంటారు, అయితే విశిష్టమైన తీగలవాయిద్యం. దక్షిణభారత కర్ణాటకసంగీతంలో వాడుతారు. విచిత్రవీణకు దగ్గరి పోలికలు ఉంటాయి.

### 7) విచిత్రవీణ

ఇది ఏకతంత్రవీణకు ఆధునికరూపం. హిందుస్థానీ, ఉత్తరభారతదేశ సంగీతసంప్రదాయానికి సంబంధించిన వాయిద్యం. దీనికి రెండు తంబురలు ఉంటాయి. స్వరాబత్‌వీణ మరియు బొబ్బిలివీణవంటివికూడ భారతీయసంగీతవాయిద్యంలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి.

### సప్తస్వరాలు

తీగలు మీటుతూ సప్తస్వరాలు అందించే దివ్య వాయిద్యం వీణ. భారతీయసంగీతంలో సప్తస్వరాలు అనగా స, రి, గ, మ, ప, ద, ని అన్నవి ముఖ్యమైన శృతులు. కర్ణాటకసంగీతంలో ముఖ్యస్వరాలు– స(షడ్జమం), రి(ఋషభం), గ(గాంధారం), మ(మధ్యమం), ప(పంచమం), ద(ధైవతం), ని(నిషాదం).

ఈ సప్తస్వరాలు ఒక్కొక్కటి ఒక్కొక్క పక్షికూత లేదా జంతువు అరుపునుండి పుట్టినవే. స(నెమలిక్రేంకారం), రి(ఎద్దురంకె), గ(మేకఅరుపు), మ(క్రౌంచిపక్షికూత), ప(కోయిల కూత), ద(గుర్రంసకిలెంత), ని(ఏనుగుఘీంకారం). ఇవి భారతీయశాస్త్రీయసంగీతానికి ప్రాణం పోసి రాగాలను ఏర్పరు స్తారు. రాగము అన్నది భారతీయశాస్త్రీయసంగీతానికి ప్రాణం. ఇది స్వరాలకలయికతో ఏర్పడిన ఒక భావోద్వేగభరితమైన నమూనా, అనగా సంగీతనమూనా అని చెప్పొచ్చు.

జూలై 16, 2026న పూరీజగన్నాథరథయాత్ర సందర్భంగా..

మన దేవాలయాలు

# గుండిచయాత్ర

-డా॥యస్.పద్మావతి, 96762 69300

పవిత్రయాత్రాస్థలం పూరీకి శ్రీక్షేత్రం, నీలాచలం అనే పేర్లున్నాయి. ఇది శ్రీజగన్నాథుని నివాసస్థానం.

కల్యాణమూర్తి జగన్నాథస్వామికి జరిగే ఇరవైరెండు ఉత్సవాల్లో రథయాత్ర ముఖ్యమైంది. దీనికే గుండిచయాత్ర అనిపేరు. ఆషాఢమాసం, శుక్లపక్షం, విదియరోజున జగన్నాథుడు, చెల్లెలు సుభద్ర, అన్న బలభద్రస్వామి ముగ్గురు దేవుళ్ళు పెద్దదేవాలయం వదలి గుండిచమందిరానికి మూడు రథాల్లో ప్రయాణం చేస్తారు.

రథాల్లో కూర్చున్నదేవుళ్ళు తొమ్మిదిరోజులు యాత్ర చేస్తారు. బలభద్రుడు ముందు తరువాత సుభద్రాదేవి, ఆ తర్వాత జగన్నాథస్వామి తమ రథాలకి వేంచేస్తారు. అందరికి ముందు నాలుగోదేవుడు దారు త్రికోణస్తంభఆకారంలో ఎర్రనయ్య సుదర్శనుడు సుభద్రరథంలోనికి వచ్చి చేరుతాడు.

ఇక కాళధ్వజ, దేవదళన, నందిఘోష రథాలు ఒకదానివెంట మరొకటి భక్తులు రథాలకి కట్టిన తాళ్ళు పట్టి లాగుతూంటే ముందుకి సాగుతాయి. ముగ్గురుదేవుళ్ళు మూడురథాల్లో మైలున్నరదూరంలో గుండిచమందిరం చేరుకునే దారిని 'బొడొదాండొ' అంటారు. గుండిచమందిరానికి మరొక పేరు జనకపురి. అక్కడ దేవుళ్ళు ఏడురోజులు ఉంటారు. వెళ్ళేందుకు ఒకరోజు, తిరిగి వచ్చేందుకు ఒకరోజు మొత్తం తొమ్మిదిరోజులు సాగుతుంది ఈ యాత్ర. ఆషాఢశుద్ధదశమి రోజున మూడురథాలు పెద్దదేవాలయానికి తిరుగుప్రయాణ మవుతాయి. ఇంతటితో రథయాత్ర సమాప్తమవుతుంది. ఈ యాత్ర అంతాకూడా ఎంతో నేత్రపర్వంగా ఉంటుంది.

ఇక్కడ స్వామికి ఉదయం 8.30గంటలనుండి రాత్రి 11.00గం॥లవరకు నిత్యము 56భోగములు నివేదన చేస్తారు. ఆ ప్రసాదాలకే 'మహాప్రసాదం' అని పేరు. ఇది ప్రతిరోజూ ఆరుసార్లు నివేదించబడుతుంది. అవి గోపాలవల్లభ్‌భోగ (ఉ.8.30 గం॥లకు), సకలధూప (ఉ.10.00గం॥లకి), భోగ మంటపభోగ(ఉ.11-00 గం॥లకు), మధ్యాహ్న ధూప (మ.12.30 గం॥లకు), సంధ్యాధూప (రా.7.00గం॥లకు), బాదసింగరభోగ (రా.11.00 గం॥లకు) అనేపేర్లతో నివేదించబడే ప్రసాదాలన్నీ మధురతీపిపదార్థాలతోనే నివేదనలు చేయబడతాయి. స్వామి భుక్తశేషాన్ని ప్రసాదంక్రింద భక్తులకు విక్రయిస్తారు. ఈ విక్రయం జరిగే ఆనందబజారు అను ప్రదేశం మిక్కిలి పెద్దదైన బహిరంగ తినుబండారాల విక్రయస్థలం. రాత్రి 11గం॥లకు స్వామికి పవళింపుసేవ జరుగుతుంది.

"మనిషి దేహం ఒక రథం. అందులో ప్రయాణిస్తుంది ఆత్మ. ఈ రథానికి సారథి బుద్ధి. మనస్సే కళ్ళెం. ఇంద్రియాలు గుర్రాలైతే పయనించే మార్గం భోగించాలన్న సమస్తవిషయాలు" అని తెల్పడమే జగన్నాథరథయాత్ర సందేశం. ఈ రథయాత్రలో మనమూ పాల్గొని జగన్నాథుని కృపకు పాత్రులమవుదాం.













శ్రేష్ఠలూరి వేంకటార్య ప్రణీత

# శ్రీనివాస విలాస సేవధి-ద్విపదకావ్యం

సంక్షిప్తవచనం- ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి

*గత సంచిక తరువాయి...*

ఇట్లు నుతించుచు తన ఇలవేల్పును, ఆ పరమేశ్వరుడే కనుగొన్న పెన్నిధిని, కరుణాసాగరుని, అలమేలుమంగను వక్షః స్థలముపై అలంకరించుకొన్నవాడు, వికసితపద్మపత్రనేత్రుడు అయిన శ్రీనివాసుని మనసున నిలిపి, సేవించి, ప్రార్థించి, నుతించి, పిమ్మట త్రిలోకజనని, క్షీరాబ్ధి కన్యకామణి అయిన అలవేలుమంగమ్మను కూర్మితో సేవించి, ఆదిశేషునికి, గరుడునికి, సేనాధిపతులకు మ్రొక్కి, గురువర్యులకు సాష్టాంగ నమస్కారములాచరించి, సద్భక్తి ప్రకటితమగునట్లుగా వాధూల వంశాలంకారుడు, మాటలలో తెలుపలేని అపారమైన జ్ఞానము చేత వెలుగొందునట్టి తన ఆచార్యవర్యులు నన్నావి అప్పలా చార్యులను సేవించినాడు. వాల్మీకి, బాదరాయణులను, సుజన సమ్మతినందిన సుకవి వరేణ్యులను పేర్కొని తన మనోరథ సిద్ధికై ప్రస్తుతించి, రసజ్ఞసమూహము సంతసించునట్లుగా సత్కావ్యరచన కావింపదలచి, ఆకళంకమైన సత్కథలకు అన్వే షించసాగెను.

అట్టియెడ సిరులు కురియు చందురుని మించిన మోమువాడు, ఇంద్రనీలకాంతులను జయించగల చక్కనివాడు, పద్మకాంతులను మించిన కన్నులవాడు, ఊర్ధ్వపుండ్రముల చేత విలసిల్లువాడు, మెరుపులను మకరకుండలములు ధరించినవాడు, బంగారుపట్టువల్లెవాటుతో ఒప్పినవాడు, నిండైన రాజసముతో, చిరునవ్వు వెన్నెలలు చిలుకరించువాడు, దయారసమును నిరంతరము జీవులపై ప్రసరింపచేయువాడు, లీలలతో రంజిల్లువాడు, మన్మథుని మించిన చక్కదనములవాడు, పూజనీయుడైన ఒక మహాపురుషుడు చంద్రబింబమువంటి మోముతో ఒప్పారు రమణితోకూడి మేలిమిబంగరుమేడపై యుండగా అమితాశ్చర్యముతో కవి అక్కడకు చేరి పరవశుడై నిలిచియుండెను.

అత్యంత వైభవవిజితుడైన ఆ దివ్యపురుషుడు కవిని వీక్షించి ఇట్లు పలికినాడు. ఓ కవివర్యా! పూర్వము సంస్కృత. ప్రాకృతాదిభాషలలోను, ద్రవిడ, ఆంధ్రభాషలలోను అనేక ప్రబంధములను వివరించినావు. ఇప్పుడు మాకు సంతసము కలుగునట్లుగా శేషాచలవైభవమును ఒక కృతిగా నిర్మింపుము. అలంకారములు, వర్ణనలతో, శృంగార, వీర, అద్భుతరసములు, భావములు రంజిల్లునట్లుగా, ఎల్లరకు తేటతెల్లమగునట్టి ద్విపద ఛందస్సుతో తెలుగులో రచింపుము. వరాహ, వామన, బ్రహ్మాండ, పద్మ, గరుడ, స్కంద, మార్కండేయాది బహు పురాణములలో వర్ణింపబడి ఉన్న శ్రీనివాసుని కథలలోని చిక్కులను తొలగించి సాగరగర్భమున దాగిఉన్న రత్నరాసులను ఏరి, సానబెట్టి, మెరుగులుపెట్టి, అభరణములను రూపొందించి నట్లుగా వీనులకింపైన కృతిగా నిర్మింపుము. పూర్వము భాగవత భక్తులు మాకు కావ్యములను కూర్చినారు.

ఇట్టి కలగన్న కవి మేల్కొని అచ్చెరువంది ఆ కలను తలచి తలచి శ్రీనివాసుడే నాపై ఆదరముతో ఇట్లు అనతిచ్చి నాడని నిశ్చయించుకొని తనకు లభించిన అగణిత భాగ్య సంపదకు ఆనందంతో ఆత్మ ఉప్పొంగగా వరాహ, వామన, బ్రహ్మాండ, పద్మ, గరుడ ఇత్యాది పురాణముల కథలు వెదకి, వాటిలోని ప్రక్షిప్తములను తొలగించి, నిగ్గుతేల్చి ప్రసిద్ధకథను గ్రహించి శ్రీనివాసుని చిత్రకథను విస్తృతరీతిలో పరిశీలించి, పునరుక్తులను విడిచిపెట్టి, మొదలు, తుద నేర్పాటుచేసి, పూర్వోత్తర విరోధములను కలుగనీయక, సముచితమైన ఉపమాద్యాలంకారములతో, అతులశృంగార, వీర, అద్భుత రసములు అతిశయించునట్లుగా, మహాకావ్యలక్షణ సమ న్వితముగా తెలుగులో 'శ్రీనివాసవిలాససేవధి' కావ్యమును వేంకటాద్రివైభవము ఇంపొందునట్లుగా, భూలోకఖ్యాతి వహించునట్లుగ, రచింప సమకట్టినాడు. *(ఇంకా ఉంది)*



2026, జూలై 30న
శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ సందర్భంగా..

# వైఖానసం

-డా॥కె.బి.రాజేంద్రప్రసాద్,
77993 00342

వైష్ణవంలో వైఖానసం విశిష్టం, వరిష్ఠం, గరిష్ఠం అనాలి. తిరుమల శ్రీవారిఆలయంలో విఖనసఆగమవిధులతోనే పూజలు, సేవలు, క్రతువులు, ఆరాధనలు, అర్చనలు, నైవేద్యాలు ఒక్కటేమిటి? సర్వం వైఖానసఆగమమే.

పరమాత్మ సృష్టియజ్ఞ నిర్వహణకు, వేదాల అవసరాన్ని గుర్తించి, చతుర్ముఖబ్రహ్మను సృష్టించాడు. బ్రహ్మ వేదమంత్ర రాశిని అద్భుతంగా మంత్రద్రష్టమైన మహర్షులకు పంచారు. అర్చామూర్తుల ఆరాధనార్చనలకు, పూజలకు, దేవాలయ నిర్మాణాది విధివిధానాలను క్రమపద్ధతితో జీవులకు అందించ డానికి విఖనసుడనే మానసపుత్రుని సృష్టించి, నైమిశారణ్యానికి పిలిపించి, ఆగమశాస్త్ర విధివిధానాలను వైదిక ధర్మబద్ధంగా, విశ్వరక్షణ జీవ సంరక్షణలకు వీలుగా, మేలుగా, బోధించి, ప్రచారం చేయాలని నిర్దేశించడం జరిగింది. అలా విష్ణువు అంశతో భువికి భగవత్‌శాస్త్రమైన ఆగమశాస్త్రాన్ని అందించడం వలన ఈ వైష్ణవఆగమం మహర్షిపేరుమీద వైఖానసం అని పిలువబడింది. వైఖానసులందరూ తపోసంపన్నులు. మనో మేథస్సులను మథించి వ్రాసినది వైఖానసం.

విఖనసుని శిష్యులు అత్రి, భృగు, కశ్యప మరియు మరీచి మహర్షులు. వీరు వైఖానసాన్ని ప్రచారం చేయడంతో పాటు అనేక సంహితలు వ్రాసిన అక్షరదీక్షాపరులు. దేవాలయ నిర్మాణాలు, ప్రతిష్ఠలు, సేవలు, ఉత్సవాలు మొదలైనవాటితో పాటు వివిధ ప్రాయశ్చిత్తాలనుగూర్చికూడా వీరు వివరించారు.

కృష్ణ యజుర్వేద తైత్తిరీయ శాఖానుసారంగా వైఖాన సాగమం సాగింది. ఏకేశ్వరభావాన్ని విశ్వసించడం. పరమాత్మ విష్ణువును పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధరూపాలతో పూజించడం. విష్ణువే సర్వోన్నతుడు, సర్వవ్యాపకుడు. కనుక వైదిక క్రతువులకన్నా విష్ణుఆరాధనవలన ఫలితం ఉంటుందని నమ్మడం. వైఖానసకల్పసూత్రాలైన స్మార్తసూత్రం, ధర్మసూత్రం, ప్రవరసూత్రం, శ్రౌతసూత్రం మొదలైన కర్మలకు; అనుష్టానాలకు, ఆశ్రమధర్మాలకు, హవిర్యజ్ఞం, సోమయజ్ఞం మొదలైన వైదిక సంప్రదాయానుసారంగా వైఖానసం సాగుతోంది. అందుకే వీరి ఆచారాలలో నియమాలు, నిష్ఠలు, నీతి, భక్తిరీతి, నిర్వహణా నిజాయితీలకు పెద్దపీట వేయడం జరిగింది. ఆలయ ఆరాధన లలో కఠినతరనియమాలు, పూజలలో నైతికజీవనశైలి కన్పిస్తాయి. స్వచ్ఛత, పవిత్రత, రుచి, శుచి, దేవతల అభిరుచి మొదలైన విషయాలలో అర్చకులు బాధ్యతగా ఉండాలంటారు. విష్ణువునకు శ్రీమహాలక్ష్మికిని ఆచరణాత్మక అనుసంధానం ఉంటుంది.

నైవేద్యాల తయారీనుండి, సమర్పణ, వితరణ, భక్ష్యా స్వాదనలలో ప్రత్యేకత ఉంటుంది. వైఖానస అర్చకులు విధిగా అష్టాదశసంస్కారాలను పూర్తి చేసుకొన్నవారే ఆరాధనకు అర్హులు. నైవేద్యాలు, ఉత్సవాలు ఋతుధర్మానుసారంగా విభిన్నంగా నిర్దేశించడం జరిగింది. మొత్తానికి వైఖానసం విశిష్టమైన, విఖ్యాతమైన ఆచారవిధి విధానాలతో పరమాత్మను ఆరాధించే వైనం మహోన్నతం అనాలి.

జీవులకోసం దేవుడు. దేవునికోసం జీవులు. వీరిని ఏకం చేసే సమన్వయసౌజన్యవేదియైన దేవాలయ సంస్కృతికి అద్దం పట్టినవే ఆగమాలు.



కోపమొస్తే, కొన్నిరోజుల్లో పోతుంది. అనుమానమొస్తే నీ మనశ్శాంతే పోతుంది

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

(తిరుమల–తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:

కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,

కీ.శే. శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం...)*

అని నుడివిన సమాచారము భక్తులకు మిక్కిలి యుపాదేయమైన విషయమును సూచించుటచేత భగవత్కైంకర్య నిర్వహణసమయములందు వాహనస్థులైయుండి స్వామి కైంకర్యమును చేయుడు అని నియమించిరి. పూర్వకాలము నందును వేంకటాద్రి నరసింహుని యాజ్ఞయున్నందున నాడు మొదలుకొని పట్టమందుండిన జియ్యరులు కైంకర్యనిర్వాహకాల యందు వాహనస్థులై యుండిరి.

**తిరుపతిలో ఆముక్తమాల్యదా(గోదాదేవి) తిరువాడిపూర్వము నాడు (మిథునమాస పూర్వఫల్గునీ నక్షత్రోత్సవమునాడు) 'కూడల్ వళైచ్చు' అను సంప్రదాయము నిర్వహించుట:**

వేదవ్యాసభగవానుని శిష్యులై కాలత్రయధర్మద్రష్టలైన సూతమహామునులు శ్రీవరాహపురాణమున శ్రీవేంకటాచల మాహాత్మ్యఘట్టమున అష్టోత్తరశతనామాధ్యాయమున "గోవిందాయ నమస్తుభ్యం శ్రీనివాసాయ తే నమః" అని శ్రీవేంకటాచలపతికిని శ్రీగోవిందరాజస్వామికిని ఐక్యము తోచునట్లుగ చెప్పియున్నందున కట్టియం యాదవరాజు రాజ్య మేలునప్పుడు శ్రీభగవద్రామానుజాచార్యుల కాలమందు చిదంబరము గోవిందరాజస్వామి ఒకానొక కారణవశమున కావేరీతీరమునందలి శ్రీచిత్రకూటమని పురాణప్రసిద్ధమైన దివ్యక్షేత్రమును విడచి తిరుమల యడివారమున తిరుపతియనెడు దివ్యనగరమున విజయముచేసి నిత్యనివాసముచేయుచు శ్రీవేంకటేశ్వరున కపరావతారమై బహుచేతనులకు దృష్టా దృష్టసుఖప్రదులై దేవతారాధన లందుకొనుచుండిన కాలమున శ్రీభాష్యకారులు, శ్రీగోవిందరాజస్వామి శ్రీవేంకటేశ్వరస్వామితోడ సమస్తైశ్వర్యములు భేదములేకుండ అనుభవించుటకు సూచకముగా ఆళ్వారుశ్రీపుత్రికయగు ఆముక్తమాల్యదను వామ హస్తమున కల్హారపుష్పమును (మంచి సుగంధముగల ఒక కలువ జాతి) ధరించునట్లు జేసి దివ్యైశ్వర్యాభివృద్ధికారిణియైన వ్యూహ లక్ష్మికి వలసిన యంత్రమంత్రోద్ధరణాదులను దివ్యసింహా సనమున చెక్కించి శ్రీగోవిందరాజస్వామికి దక్షిణపార్శ్వమున వైఖానసాగమముప్రకారముగ ప్రతిష్ఠ జరుగులాగున చేసి సమస్తోత్సవములను పొందునట్లుగ సంకల్పించి పిదప, గోదా దేవియు

**"పాండ్యదేశే కలే రాదా ధన్వినవ్యపురే శుభే,**
**కృష్ణానుభవపూర్త్యర్థం భామా భూమే జనిష్యతి."**

(కలియుగారంభమున పాండ్యదేశమందు మంగళ కరమైన 'ధన్వినవ్యపుర'మనెడు శ్రీవిల్లిపుత్తూరునందు కృష్ణానుభవము పూర్తిచేసికొనుటకై భామ (సత్యభామ) భూమియం దవతరింపగలదు)

అని హరివంశమునందును –

**"అయోనిజా చ తులసీకాననే విశ్వధారిణీ,**
**జనిష్యతి కలౌ దేవీ మానుషీ కృష్ణభక్తితః."**

(భూతధాత్రియగు భూదేవి కలియుగమున కృష్ణభక్తి వలన తులసీవనమున అయోనిజయై మానుషాకారియై జనింప గలదు.)

అనియు పౌరాణికులు చెప్పినతీరుగ భూమ్యాంశమున తులసీ వనమందలి భూమియందు దివ్యావతారము చేసి –

**"ఆరభ్య శైశవ మనారత మచ్యుతాంఘ్రి –**
**భక్త్యా నిరస్తవిషయాంతర భావబంధే"**

(బాల్యము మొదలుకొని అనవరతము ఆచ్యుతుని చరణభక్తితోడ విషయాంతరములపై హృదయాసక్తిలేని.......)

*(ఇంకా ఉంది)*

ధర్మనీతి

# ధర్మరాజు - యమధర్మరాజు

- డా॥ ఎన్.సి.హెచ్. సుధామైథిలి,
82475 78748.

భారతీయ ఇతిహాసాలలో మహాభారతానికి విశిష్టమైన స్థానం ఉంది. ఈ మహాకావ్యంలో ధర్మం, న్యాయం, కరుణ, త్యాగంవంటి మహత్తర విలువలను వివిధపాత్రలద్వారా మనకు బోధించారు. వాటిలో ముఖ్యంగా ధర్మరాజు భూతదయకు, ధర్మనిష్ఠకు ప్రతీకగా నిలిచాడు. అతని జీవితం అంతటా ధర్మమే మార్గదర్శకంగా ఉండేది. ధర్మరాజు భూతదయను స్పష్టంగా తెలియజేసే సంఘటనల్లో శునకకథ అత్యంత ప్రసిద్ధమైనది.

మహాభారతయుద్ధం అనంతరం, కృష్ణనిర్యాణం తర్వాత ధర్మరాజు పరీక్షిత్తుకు పట్టం కట్టి విరక్తుడై సర్వం త్యజించి, సశరీరంతో స్వర్గప్రాప్తికై ఉత్తరదిశగా పయనమయ్యాడు. ఈ ప్రయాణంలో ముందుగా ద్రౌపది, ఆమె వెనుక పాండవులు ఒక్కొక్కరుగా నడిచారు. దారిలో వారందరూ క్రింద పడి పోయారు.

ఆ ప్రయాణం అంతా ధర్మరాజుతోపాటు ఒక శునకం కూడా నడుస్తూ వచ్చింది. అది ఆకలితో, అలసటతో ఉన్నా ధర్మరాజును విడిచి వెళ్లలేదు. ధర్మరాజుకూడా దానిని నిర్లక్ష్యం చేయకుండా ప్రేమతో చూసుకున్నాడు. ఈ సంఘటన అతనిలో ఉన్న అన్ని జీవులపట్ల కరుణ- భూతదయను స్పష్టంగా చూపిస్తుంది.

అలా ధర్మరాజు నిర్వికారంగా ముందుకు పోసాగాడు. కొంతదూరం పోయినతరువాత మహేంద్రుడు ధర్మరాజుముందు రథంతో వచ్చి నిలిచాడు. ఇంద్రుణ్ణి చూసి ధర్మరాజు వినయంతో నమస్కరించాడు. ఇంద్రుడు ధర్మరాజును తన రథముమీద కూర్చోమని చెప్పాడు. ధర్మరాజు బాధతో "మేము అయిదుగురు అన్నదమ్ములము, ద్రౌపది బయలుదేరాం. నా నలుగురు తమ్ములు, ద్రౌపది నేలకూలారు. వారులేనిది నేను ఎక్కడకు రాను. వారుకూడా నాతో వచ్చేలా చెయ్యి" అన్నాడు. అప్పుడు ఇంద్రుడు "ధర్మనందనా! వారందరూ వారివారి శరీరాల్ని వదిలిపెట్టి స్వర్గలోకం చేరుకున్నారు. వారిని అందరిని నీవు స్వర్గలోకములో చూస్తావు. వారు మానవదేహాలను వదిలారు కనుక తిరిగి ఆ దేహం పొందడం అసాధ్యం కనుక నాతో నీవిప్పుడు స్వర్గానికి రా" అని అన్నాడు. అందుకు ధర్మరాజు ఇంద్రుడితో "మహేంద్రా! మేము హస్తినాపురంనుండి బయలు దేరినప్పటినుండి ఈ శునకము నన్ను వెన్నంటే వస్తోంది. దీనిని వదిలిపెట్టి నేనుమాత్రం స్వర్గానికి ఎలా రాగలను, కనుక నాతోపాటు ఈ శునకాన్నికూడా స్వర్గానికి తీసుకుని వెళ్దాం" అన్నాడు. ఆ మాటలకు ఇంద్రుడు నవ్వి "ధర్మనందనా! అది ఎలా సాధ్యం. నీవెంట వచ్చిన కారణంగా శునకానికి ఎలా స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది? దీనిని స్వర్గానికి తీసుకుపోకూడదు కనుక నీవు మాత్రం రథం ఎక్కు" అన్నాడు.

అందుకు ధర్మరాజు "మహేంద్రా! లోకపాలకుడవు అయిన నీకు తెలియనిది ఏమున్నది? ఈ శునకము అత్యంత భక్తిశ్రద్ధలతో నన్ను వెన్నంటి వచ్చింది. ఇప్పటివరకు నన్ను వెన్నంటి వచ్చి నన్ను సేవించిన ఈ శునకమును వదిలి నేను మాత్రం ఎలా స్వర్గానికి రాగలను? నన్ను భక్తితో సేవించిన ఈ శునకమును వదిలి నేను మాత్రం స్వర్గసుఖాలను ఎలా అనుభవించగలను?" అని అన్నాడు.

అందుకు ఇంద్రుడు "ధర్మనందనా! కుక్కలకు స్వర్గలోక ప్రాప్తి లేదు. నీకు శుభం కలుగుతున్నప్పుడు దీనిని వదిలి పెట్టడం న్యాయమే. ఇందులో దోషం ఏమియూ లేదు" అన్నాడు. ఆ మాటలకు ధర్మరాజు "భక్తితో సేవించినవారిని వదిలి రావడం బ్రహ్మహత్యాపాతకంతో సమానం అంటారు. నీవు అన్ని ధర్మాలను తెలిసినవాడివి కనుక నీకు చెప్పే పని లేదు కదా!" అన్నాడు. కనుక కేవలము స్వర్గసుఖాలను అనుభవించడానికి నన్ను భక్తితో సేవించిన ఈ శునకమును వదిలి స్వర్గానికి రాలేను అన్నాడు.

ఆ మాటలకు ఇంద్రుడు "ధర్మనందనా! ఏదైనా వ్రతం చేసేవాడు కుక్కను ముట్టుకుంటే వ్రతభంగం అయింది అనుకుంటాడు. మహాపాపమని అనుకుంటాడు. అలాంటి సమయాన నీవు ఈ కుక్కగురించి ఎందుకు పట్టుబడుతున్నావు. దీనిని వదిలి వచ్చి హాయిగా స్వర్గసుఖాలను అనుభవించు. అయినా ధర్మనందనా! నీ భార్య ద్రౌపది, నీ నలుగురు తమ్ములు నీ కళ్ళఎదుటే మరణించినా చలించనివాడివి. ఈ కుక్కను మాత్రం ఎందుకు వదలనంటున్నావు?" అని అడిగాడు.




అదివిని ధర్మరాజు "మహేంద్రా! నీవు సకల లోకపాలకుడవు. అన్ని ధర్మాలు ఎరిగినవాడవు, ధర్మదేవతవు. నీతో వాదించగల అర్హత కలిగినవాడిని కాదు నేను. అయినా నాకు తోచిన ధర్మం నేను చెప్తాను. నాకు తోచిన ధర్మం చెప్పడం తప్పు కాదు. శరణువేడిన వారిని వదలడం, మంచిమిత్రుడికి ద్రోహం చెయ్యడం, స్త్రీలను చంపడం, బ్రాహ్మణుల ధనం అపహరించడంవలన ఏ పాపం వస్తుందో నన్ను నమ్మి వెన్నంటి వచ్చిన ఈ శునకమును వదిలిన ఆ పాపమే వస్తుంది. ఆ పాపమును నేనిప్పుడు ఎలా మూట కట్టుకోను. నేను అనుభవించవలసిన స్వర్గసుఖముల విషయము వదిలిపెట్టండి. నేను ఇంతవరకు సంపాదించిన పుణ్యం ఈ శునకమును ఆదరించినకారణంగా నశించినా ఫరవాలేదు. నాకు స్వర్గసుఖాలు వద్దు. నన్ను ఇలా వదిలిపెడితే ఈ అరణ్యంలో తపస్సు చేసుకుంటాను. నాకిది చాలు" అన్నాడు.

అప్పటివరకు శునకరూపంలో ఉండి ధర్మరాజు చెప్పేది వింటున్న యమధర్మరాజు తన నిజరూపందాల్చి అతడిముందు సాక్షాత్కరించాడు. ధర్మరాజు సంభ్రమాశ్చర్యాలతో తనముందు నిలచిన యమధర్మరాజుకు నమస్కరించాడు.

అప్పుడు యమధర్మరాజు "నాయనా ధర్మరాజా! నీ పుణ్యచరిత్ర, నీ ధర్మనిరతి, నిర్మలమైన బుద్ధి, భూతదయ, నీ దయాగుణం నాకు ఎంతగానో నచ్చాయి. భూలోకంలో నీవంటివారు ఉంటారా అని నాకు సందేహం కలుగుతుంది. విశ్వాసంతో వెన్నంటివచ్చిన కుక్కకోసం, సాక్షాత్తు ఇంద్రుడు దిగివచ్చి రథం ఎక్కమని చెప్పినా నిరాకరించిన నీ ధర్మనిరతి కొనియాడ తగినది. నీకు సాటి అయినవాడు స్వర్గలోకంలో లేడు. నీ ధర్మనిరతిని ఇంద్రుడు గమనిస్తూనే ఉన్నాడు. ఇంక నీవు ఈ శరీరంతో రథంలో పుణ్యలోకాలకు వెళ్ళు. అక్కడ నీకు సకలసౌఖ్యాలు లభిస్తాయి" అని అన్నాడు యమధర్మరాజు. ఆ సమయంలో అక్కడకు గంధర్వులు, దేవఋషులు, మరుత్తులు, అశ్వినులు, వసువులు పరమానందంతో వచ్చారు. వారంతా ధర్మరాజును ఇంద్రుడు తీసుకువచ్చిన రథంమీద కూర్చుండబెట్టారు. రథంకదిలింది. వారంతా వెంటరాగా ధర్మరాజు పుణ్యలోకాలకు వెళ్ళాడు.

**నీతి: తననే నమ్ముకుని తన వెంటే వచ్చిన శునకం నమ్మకాన్ని వమ్ము చేయక దయను చూపి మహనీయుడయ్యాడు ధర్మరాజు. మనమూ దీనిననుసరించి తరించాలన్నదే పై కథానీతి.**

## మే నెల క్విజ్-46 సమాధానాలు

01) స్త్రీ శక్తి, మంగళకార్యత
02) అధ్యయనం చేయబడిన
03) హనుమత్తోడి
04) జయదేవుడు
05) శ్రీకృష్ణదేవరాయలు
06) మనుచరిత్రలో
07) ముద్దుపళని
08) సాళువనరసింగరాయలు
09) ఆర్.సి.కృష్ణస్వామిరాజు
10) సంకటహరచతుర్థి
11) మోహినీ ఏకాదశి
12) వైశాఖశుద్ధపూర్ణిమ
13) తిరుక్కురుంగుడి
14) హరి
15) అన్నమయ్య

సరైన సమాధానాలు వ్రాసినవారు-

01)ఎం.కీర్తిక, తూర్పుగోదావరి 02)టి.గీతిక, తూర్పుగోదావరి 03)సి.హెచ్.తేజస్వి, తూర్పుగోదావరి 04)సి.హెచ్.చిన్మయి, పోచారం 05)ఆర్.నాగమహిక, పాలకొల్లు 06)ఎమ్.ఎన్.శ్రీమహాలక్ష్మి, హైదరాబాదు 07)జి.కే.కృష్ణంనాయుడు, శ్రీకాకుళం 08)కె.హర్షితకుమార్, సిరిసిల్ల 09)ఎమ్.శ్రీరాం విరించి, హైదరాబాదు 10)పి.జాహ్నవ్, ఖమ్మం 11)కె.ఋత్విక్ సాయి, ఖమ్మం

బాలనీతి

# పుస్తకం మన నేస్తం

- శ్రీమతి ఆసూరి ఉషారాణి, 94416 46016

విద్యార్థులు చదువు ప్రారంభించేముందు సరస్వతీ దేవిని ప్రార్థిస్తూ చదివే ఈ పద్యం పుస్తకంయొక్క ప్రాముఖ్యతను తెలుపుతుంది.

**తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్ నీవు నా ఉల్లంబందున నిల్చి, జృంభణముగా నొప్పున్ పద్యముల్ మదిన్ వెల్లన్ జేయుము వాక్కునన్ విమలతన్ విన్పించుమా యెప్పుడున్ నల్లన్ నైదువు మల్లకున్ మొలికెదన్ నా తల్లి భారతీ!**

ఓ సరస్వతీమాత! నిన్ను తలచుకొని పుస్తకాన్ని చేత పట్టుకున్నాను. నీవు నా మనస్సులో నిలిచి, మంచిమాటలు నా నోట పలికేలా ఆశీర్వదించు తల్లీ!

అలా పుస్తకం గొప్పతనాన్ని పిల్లలకి తెలియజేసే చిన్న ప్రయత్నమే ఇది.

ఆ రోజు వెంకట్ పుట్టినరోజు. ముందురోజే తన స్నేహితులందరినీ మరుసటిరోజు సాయంత్రం తన ఇంటికి




రమ్మని పిలిచాడు. వెంకట్ ఇంటి పనిమనిషి కొడుకు గోవిందు తనను పుట్టినరోజుకు తీసుకెళ్ళమని తన తల్లిని కోరాడు. అందుకు గోవిందు అమ్మ "వద్దు. అందరూ గొప్ప గొప్ప బహుమతులు తీసుకుని వస్తారు. మనం పేదవాళ్ళం. ఏమీ కొనలేం. నాకంటే తప్పదు పని ఉంటుంది వెళ్తాను" అంది.కానీ గోవిందుకి వెళ్లాలని ఎంతో కోరిక. ఏమి తీసుకెళ్లాలో అర్థం కావడం లేదు. తనకు గతంలో ఎప్పుడో పెద్దబాలశిక్ష పుస్తకం పాఠశాలలో బహుమతిగా రావడంతో దానిని తీసుకెళ్లాడు. అందరూ రకరకాల ఖరీదైన బహుమతులు వెంకట్‌కిచ్చి, భోజనం తినడానికి వెళుతున్నారు.

గోవిందు అమ్మ గోవిందుని చూసి "వెళ్ళిపో అంటూ సైగ చేసింది. అది గమనించి వెంకట్ "ఆ అబ్బాయి ఎవరు?" అని అడిగాడు.

"మా బాబు గోవిందు చినబాబు" అంది గోవిందు అమ్మ భయం భయంగా. వెంకట్ తనే గోవిందుదగ్గరకొచ్చి గోవిందుచేతిలో ఉన్న "పెద్దబాలశిక్ష" పుస్తకం అందుకొని, గోవిందుతో...

"ఎవరు ఎన్ని బహుమతులు ఇచ్చినా విరిగిపోతాయి. కానీ నీవు ఇచ్చిన ఈ పుస్తకం జీవితాంతం ఉంటుంది. మంచి పని చేశావు. పుస్తకం మనతో ఉంటే పదిమంది స్నేహితులు ఉన్నట్లే. నీవే నిజమైన స్నేహితుడివి. ఇక ప్రతిరోజు మీ పాఠశాలసమయం అయిపోయినతర్వాత నీవు మాఇంటికి రా! మనిద్దరం ఎన్నో పుస్తకాలు చదువుకుందాం. మా నాన్నగారు కూడా ఎన్నో పిల్లలపుస్తకాలు తెప్పిస్తుంటారు. సరేనా! అంటూ గోవిందుకి తిరిగి ఎన్నో బహుమతులు ఇచ్చి తన గొప్పమనసు చాటుకున్నాడు వెంకట్.

పైగా మన గురువులుకూడా "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో. కానీ మంచిపుస్తకం మాత్రం కొనుక్కో" అని అన్నారు కదా! అన్నాడు వెంకట్ చివరగా. వచ్చిన వారందరూ వెంకట్‌ని, గోవిందుని ఎంతో పొగిడారు.

**నీతి: పుట్టినరోజంటే కేకులు, చాక్‌లెట్లు, మిఠాయిలు పంచి పెట్టడంలాంటివే చేస్తున్నారు. కానీ, జీవితంలో మంచి విలువలు నేర్పే ఇలాంటి పుస్తకాలు బహుమతులుగా ఇస్తే మంచి భావి భారతపౌరులుగా తయారవుతారు కదా అన్నదే పై కథానీతి.**

# శుభముహూర్తం!!

అది 1940వ సంవత్సరం. విక్రమనామ సంవత్సరం ఆషాఢమాసం శుద్ధ సప్తమీ గురువారం ఉత్తరఫల్గునీనక్షత్రంతో కూడిన మంచిరోజు. అర్చకులు శ్రీసుందరరాజస్వామికి కలలో సాక్షాత్కరించి, నిర్ణయించి చెప్పినట్లుగా ఆనాడు "శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవం" పేరుతో ఘనంగా వేడుక జరుపుకున్నారు.

వందల సంవత్సరాలపాటు యోగసమాధిలో ఉన్న శ్రీస్వామివారిని మేల్కొలిపారు. ఆ తర్వాత పురుషసూక్త శ్రీసూక్త భూనీళాసూక్తాల పఠనంతో శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి మూలమూర్తికి అభిషేకద్రవ్యాలతో మంగళప్రదంగా అభిషేకం నిర్వహించారు. పిదప సన్నని బంగారు జరీఅంచు ఉన్న తెల్లనిపంచె, ఉత్తరీయాన్ని అలంకరించారు. నుదుట తెల్లని పచ్చకర్పూరనామాలు తీర్చిదిద్దారు. వివిధరకాల పూల మాలలతో శ్రీస్వామివారి నిలువెత్తుమూర్తిని అందంగా, మనోహరంగా అలంకరించారు. ఆ తర్వాత సహస్రనామార్చన, ధూపదీపనైవేద్య, కర్పూరహారతులు ఘనంగా జరిగాయి.



ఆనాటినుండి నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో అలరారుతూంది. వివాహం కావలసిన వారు, ఇక్కడ జరిగే నిత్యకల్యాణంలో పాల్గొని శ్రీస్వామివారి కల్యాణకంకణాన్ని ధరిస్తే, తప్పక త్వరలో వివాహం అవుతుం దని ప్రసిద్ధి ఉంది.

**శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవాల సందర్భంగా....**
**(2026, జూలై 17 నుండి 19 వరకు)**

## శ్రీవేంకటేశ్వరలీలలు



# నాకు కనువిప్పు కలిగింది!!

- శ్రీ జి.ఎస్.కె.సాయిబాబా, 74165 11995

శ్రీవారి మహిమలు ఎన్నో! ఎన్నెన్నో!! అని నా జీవితంలో ఋజువయ్యాయి. ఆపదలో ఉన్నవారిని, కష్టాలలో చిక్కినవారిని, దిక్కులేనివారిని ఆదుకుని తన మహిమలు చూపి నేనున్నానని భరోసా ఇచ్చిన ఏడుకొండల వెంకటస్వామి. ఆపదమొక్కులవాడు, అనాధరక్షకుడు, దీనదయామూర్తి, దీనరక్షకుడు శ్రీనివాసుడు.

స్వామివారు సుఖాలు కలిగిస్తారు. తప్పుగా మాట్లాడితే విమర్శిస్తే నష్టాలు కలిగిస్తాడు. అదీ నా విషయంలో జరిగింది. అది ఎలా అంటే... ఒకసారి స్వామివారి దర్శనానికి కంపార్టు మెంటులో కూర్చున్నాను. భక్తులని పరిశీలించాను. గంటల కొద్దీ ముసలివారు, పిల్లలు, వయసులోవాళ్లు దర్శనానికి కూర్చున్నారు. వారిని చూస్తూ "స్వామి! మీ దర్శనానికి భక్తులు ఎంత కష్టపడుతున్నారు. బాధపడుతున్నారు. ఎదురుచూస్తు న్నారు. నీ భక్తులు ఇలా బాధపడటం నీకిష్టమా? ఏమిటి స్వామీ. నీ దర్శనం త్వరగా లభింపచెయ్యి తండ్రీ. కొంత మందికి నీరసం వస్తోంది. మరికొంతమంది నీ దర్శనం ఆలస్యమవుతుందని బాధపడుతున్నారు అని మొరపెట్టుకుని బాధపడ్డాను. అలా అనుకున్నానో లేదో కాసేపటికే నా కళ్ల జోడు, కొంతడబ్బు విచిత్రంగా మాయమయి కష్టానికి గుర య్యాను. ఇది స్వామివారి లీల. వారికి లేని బాధ, కష్టం నీకెందుకు? నువ్వు బాధపడ్డావు కాబట్టి నీకే నష్టం కల్గించాను అని అన్పించింది. చూశారా శ్రీవారి మహిమలు ఇలా ఉంటాయి మరి.

చిత్ర కథ

# గురుదక్షిణ

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్

అది వరతంతుమహర్షి గురుకులం. విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న శిష్యులు తమ గురువులకి దక్షిణలు సమర్పిస్తున్నారు. కౌత్సునివంతు వచ్చింది... అప్పుడు వరతంతుమహర్షి...




అందుకు అంగీకరించాడు రఘువు. వెంటనే కుబేరుడు మహారాజు కోశాధిగారిని బంగారునాణేలతో పంపాడు.
ఆ తర్వాత మహారాజు కౌత్సుని పిలిపించాడు..
ఆర్యా! నా కోశాగారంలోని ధనాన్ని అంతా తీసుకువెళ్లు!
ఆ మాటలకి ఆనందించాడు కౌత్సుడు...
మహారాజా! నేను దక్షిణగా గురువుగారికి ఇవ్వవలసిన ధనం పద్నాలుగుకోట్ల బంగారునాణేలు మాత్రమే! అంతపైకం మాత్రమే నేను తీసుకువెళ్తాను. అదే ధర్మం!
రఘువు కౌత్సునితో...
ఆర్యా! మిగిలినధనాన్నికూడా తీసుకెళ్లు. అది కూడా నీదే!
అదివిని కౌత్సుడు...
గురుదక్షిణకోసం మిమ్మల్ని నేను అర్థించింది పద్నాలుగుకోట్ల బంగారునాణేలు మాత్రమే. అదే నాది. మిగతాది నాది కాదు. అదే న్యాయం! ధర్మం!!
రఘుమహారాజు కౌత్సుని అభినందించాడు...
ఆర్యా! నీ ధర్మదృష్టి, న్యాయదృష్టి ప్రశంసార్హం! అలాగే నీ గురుభక్తికూడా!
కౌత్సుడు ఆ బంగారునాణేల్ని ఆనందంగా గురువుకు గురుదక్షిణగా సమర్పించాడు!
సర్వే జనాః సుఖినో భవన్తు



బాలవినోదం

# శ్రీ తిరుమలస్వామి షోడశ గోవిందనామావళి

బాలలూ..!! ఇక్కడ అంకెల్లో (01 నుండి 16 వరకు) శ్రీవేంకటేశ్వరస్వామివారి చిత్రాలున్నాయి. ఆ చిత్రాలకు, అంకెలకు తగ్గట్టుగా 16 గోవిందనామాలున్నాయి. వీటిని నిత్యమూ పఠిస్తే స్వామివారి ఆశీర్వాదాలు పొందుతాం. ఇక వీటిని కంఠాపాఠం పెట్టేద్దామా మరి!


సేకరణ, నిర్వహణ:
మొలకా ఉత్తరఫల్గుణి
చిత్రాలు: డా॥ శ్రీధరన్ కొలికి











01) ఏకాక్షర మంత్రస్వరూపా గోవిందా!
ఓంకారరూపా గోవిందా!!

02) ద్వయమంత్ర విష్ణురూపా గోవిందా!
భక్తరక్షకా గోవిందా!!

03) త్రిలోకనాయకా గోవిందా!
శంఖనాదప్రియ గోవిందా!!

04) చతుర్యుగపురుషా గోవిందా!
ఆద్యంతరహితా గోవిందా!!

05) పంచామృతాభిషేకప్రియ గోవిందా!
గోగణపాలకా గోవిందా!!

06) షడృతుపాలకస్వరూపా గోవిందా!
శ్రీతిరుమలవాసా గోవిందా!!

07) సప్తాచలవాసా గోవిందా!
శ్రీశ్రీనివాసా గోవిందా!!

08) అష్టాక్షరీమంత్రస్వరూపా గోవిందా!
అభయహస్తప్రకాశాయ గోవిందా!!





















09) నవగ్రహపాలకా గోవిందా!
కస్తూరితిలకా గోవిందా!!

10) దశావతార విష్ణురూపా గోవిందా!
శంఖచక్రగదాఖడ్గధారీ గోవిందా!!

11) ఏకాదశీవ్రతస్వరూపా గోవిందా!
లక్ష్మీ, పద్మావతీవల్లభ గోవిందా!!

12) ద్వాదశాక్షరీమంత్రస్వరూపా గోవిందా!
భాగవతప్రియా గోవిందా!!

13) త్రయోదశ సగుణస్వరూపా గోవిందా!
సీతానాయక గోవిందా!!

14) చతుర్దశభువనపాలకా గోవిందా!
శ్రీ వేంకటేశా గోవిందా!!

15) పంచదశకర్మకారకా గోవిందా!
మోక్షప్రదాయ గోవిందా!!

16) షోడశపూజాస్వరూపా గోవిందా!
సకలాభీష్టవరదాయ గోవిందా!!











# క్విజ్ 48

01) ఉమామహేశ్వరుల పుత్రుడు? జ)........................

02) హంసవాహినిగా ఆరాధింపబడే దేవి? జ)........................

03) మహావిష్ణువు అంశతో జన్మించినవాడు? జ)........................

04) గురువులకే గురువు? జ)........................

05) ఆషాఢశుద్ధఏకాదశికి మరోపేరు? జ)........................

06) సరస్వతి వీణ పేరు? జ)........................

07) శ్రీసుందరరాజస్వామివారి అవతార నక్షత్రం? జ)........................

08) అనంతరూప భగవత్కార్యసాధకుడు? జ)........................

09) బ్రహ్మదేవుని హృదయంనుండి జన్మించినవారు? జ)........................

10) వైఖానసాగమ కర్త? జ)........................

11) మనకు అత్యంత ప్రియమైన నేస్తం? జ)........................

12) కర్ణుని తల్లి? జ)........................

13) సృష్టిలో ప్రతిజీవరాశికి తొలిగురువు? జ)........................

14) నారదుని వీణ పేరు? జ)........................

15) భారతీయ శాస్త్రీయసంగీత ప్రధాన పరికరాల్లో ఒకటి? జ)........................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-07-2026**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ............

పాఠశాల: ........................ తరగతి: ............

పేరు: ........................................

చిరునామా: ........................................

........................................

........................................

........................ పిన్‌కోడ్: ............

ఫోన్ సంఖ్య: ........................................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ప్రభుత్వ పథకములద్వారా లబ్ధి, సంతానం సన్మార్గంలో యుండుటవలన మానసిక ప్రశాంతత. ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలసమయం. రక్తప్రసరణ, శ్వాసకోశసంబంధ అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.



**వృషభం–** సాంఘికంగా గుర్తింపు. రియల్ఎస్టేట్, మోటార్, యాంత్రికసంబంధ వృత్తులవారికి విశేష ఆదాయం. రాజకీయవ్యక్తులకు మంచి గుర్తింపు. తల్లి ఆరోగ్యస్థితి మెరుగు, కుటుంబ ఆనందం. వ్యాపారస్తులకు ధనలాభం.



**మిథునం–** ఉదర, నేత్ర అనారోగ్యాలకు గురయ్యే అవకాశం. బంధుమిత్రులవలన ఖర్చు, శుభ కార్యాలకు శ్రీకారం. ధనసంబంధ కార్యకలాపాలలో ప్రగతి కనబడుతుంది. కుటుంబసమస్యలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యక్తిగత గుర్తింపు కల్గుతుంది.



**కర్కాటకం–**విద్యార్థులకు చదువుల విషయం అనుకూలం కాదు. ప్రభుత్వ పథకాలవలన ధనలాభం. దాంపత్యజీవనం అంతంతమాత్రం. ఆకస్మిక ధనలాభం, వ్యక్తిత్వవికాసం, మంచి ఆలోచనలు. మాసారంభంలో ధైర్యం, కార్యసిద్ధి.



**సింహం–** దూరప్రయాణాలు చేయవలసి ఉంటుంది. కంటిసంబంధ అనారోగ్యములు, వైద్యంకోసం ధనవ్యయం మరియు సాధారణ కుటుంబఖర్చులు పెరుగుతాయి. మనోబలం తగ్గుతుంది. వీరు ప్రభుత్వరంగంనుండి ప్రయోజనం పొందవచ్చు.



**కన్య–** వృత్తి గౌరవం పెరుగుదల. ఛాతీ, ఊపిరితిత్తులకు సంబంధించి వైద్యసహాయం తీసుకుంటారు. సూర్యారాధనవలన రక్తపోటు, మధుమేహం అదుపులోకి వస్తాయి.



**తుల–** కుటుంబసభ్యులమధ్య అవగాహనాలోపాలు. సామరస్యవాతావరణానికి ప్రయత్నాలు. కుటుంబంలో చిన్న చిన్న కలతలను నివారించగల్గుతారు.



**వృశ్చికం–** మొండితనం, పట్టుదలతో లక్ష్యం దిశగా కష్టపడతారు. మిత్రులతో వృథా ధన వ్యయం చేస్తారు.



**ధనుస్సు–** ఖర్చులు పెరుగుతాయి. ప్రభుత్వము లేదా అధికారులనుండి అండదండలు లభిస్తాయి. కాంట్రాక్టర్లకు పనులు దొరుకుతాయి.



**మకరం–** మానసికప్రశాంతత ఉపశమనం. ప్రయాణాలు లాభదాయకం. ప్రియమైనవారితో విలువైన సమయాన్ని గడపడానికికూడా అవకాశం ఉంటుంది.



**కుంభం–** వీరు చూపే చొరవ విజయానికి నాంది అవుతుంది. విదేశీప్రయాణాలు అనుకూలం. సాహసం, ప్రయాణం, క్రీడలను ఇష్టపడతారు.



**మీనం–** మొరటుతనం, ఆధ్యాత్మిక ఆసక్తి, సైనికపరమైన, గవర్నమెంటు ఉద్యోగ అవకాశాలు. వృత్తి వ్యాపారాలలో స్నేహితులు, భాగస్వాములవలన లాభపడతారు.



## శ్రీ ఆళవందార్లవారి వర్షతిరునక్షత్రము

(29-07-2026)

శుచౌమా స్యుత్తరాషాఢా జాతం యామున దేశికం।
శ్రీరామమిశ్రచరణ సరోజాశ్రిత మాశ్రయే॥

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................................. తేది :..................

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి 126




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)తొలిఏకాదశిరోజున విష్ణువు నిద్రించుటవల్ల ఈ విధంగా పిలుస్తారు(6); 7)వాలి భార్య(2); 8)కశ్యపునకు దనువునందు పుట్టిన కుమారుడు(3); 11)యయాతి పుత్రుడు(3); 12)చంద్రుణ్ణి ఇలాకూడా పిలుస్తారు(4); 15)అగ్నీధ్రుని పుత్రుడు(2); 16)స్త్రీ(3); 17)బ్రహ్మమానసపుత్రుడు(2) 19)మధుర పదార్థం(2); 21)దక్షుని మనుమరాలు(4) 22)బ్రహ్మం ముఖం వలన పుట్టెను(2)

**నిలువు** 2)నహుషుని కుమారుడు(2); 3)ఈ సర్పంపైన శ్రీకృష్ణుడు నాట్యం చేశాడు(4); 4)తన తొడను కోసి, పావురం కొరకు ఇచ్చిన త్యాగశీలి(2); 5)ఆషాఢశుద్ధ పూర్ణిమ(5); 6)హ్లాదునకు దమనియను భార్యయందు పుట్టిన కుమారుడు(3); 9)పెండ్లికొడుకు(3); 10)ఔర్వుని యొక్క అయోనిజయగు కుమార్తె(3); 13)ఉంగరపు వేలు(4); 14)జ్యేష్ఠకృష్ణ ఏకాదశి(3); 18)విభీషణుని కూతురు(3); 20)ఇంద్రుని భార్య(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC



## శ్రీ చెన్నకేశవస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం,
### తాళ్లపాక

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 24-07-2026 | శుక్రవారం | దీక్షా తిరుమంజనం | అంకురార్పణ |
| 25-07-2026 | శనివారం | ధ్వజారోహణం | శేషవాహనం |
| 26-07-2026 | ఆదివారం | పల్లకిసేవ | హంసవాహనం |
| 27-07-2026 | సోమవారం | పల్లకిసేవ | సింహవాహనం |
| 28-07-2026 | మంగళవారం | పల్లకిసేవ | హనుమంతవాహనం |
| 29-07-2026 | బుధవారం | మోహిని అవతారోత్సవం | గరుడవాహనం |
| 30-07-2026 | గురువారం | --- | సా॥ఆర్జిత కల్యాణోత్సవం<br>గజవాహనం |
| 31-07-2026 | శుక్రవారం | --- | రథోత్సవం |
| 01-08-2026 | శనివారం | --- | అశ్వవాహనం |
| 02-08-2026 | ఆదివారం | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 03-08-2026 | సోమవారం | --- | పుష్పయాగం |

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
Printing on 25-06-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.

